

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :20 సంచిక: 8 హైదరాబాద్ 2021 జనవరి పేజీలు 40

Please visit : www.srimeherbaba.com వార్షిక సభ్యత్వం : రూ.100/-

# 52వ అమరతిథి

## 2021 జనవరి 30, 31 వర్చ్యువల్ సహవాస్

కోవిడ్ 19 వైరస్ ఇంకా నియంత్రణలోనికి రాని కారణంగా 2021 జనవరి 30, 31 తేదీలలో అవతారుని 52వ అమరతిథి వేడుకలు ఆన్‌లైన్‌లో ఏర్పాటు చేసినట్లు బాబా ట్రస్టు చైర్మన్ శ్రీ శ్రీధర్ కేల్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా,

**2021 జనవరి 31న మధ్యాహ్నం 12 నుండి 12.15 వరకూ**

బాబా ప్రేమికులందరూ వారి వీలునిబట్టి, ఆ సమయంలో వారెక్కడున్నా అవతారుని నామస్మరణతో మౌనం పాటించవల్సిందిగా మనవి చేశారు. **"ప్రియతమ మెహెర్‌బాబా ఎప్పుడూ మీతో వుంటాడని, ఆయన నుండి మీరు ఎన్నడూ వేరు కాదని ప్రవచించిన అవతారుని మాటలను", ట్రస్టు చైర్మన్ మరోమారు బాబా ప్రేమికులకు గుర్తుచేశారు.**

# హైదరాబాద్ నుండి మెహెరాబాద్

మెహెరాబాద్‌కు సొంత కార్లు, ఇతర వాహనాలలో వెళ్లదల్చినవారికి హైదరాబాద్ నుండి మూడు ప్రధాన మార్గాలున్నాయి. ఆ వివరాలు ఇలా వున్నాయి. పరిశీలించగలరు.

## ROUTE 1:

Hyderabad(Koti)-Patancheru-Sangareddy X ads(54KM)-Zaheerabad(95KM)-Humnabad(160KM)-Umarga(219KM)-Naldurg(260KM)-Tuljapur(291KM)-Osmanabad(319KM)-Yedashi-Yermala-Bhoom(379KM)-Jhamkhed(431km)-Ahmadnagar(508KM)-Meherabad(515KM).

## ROUTE 2:

Hyderabad(Koti)-Patancheru-Sangareddy X roads(54KM)-Zaheerabad, Humnabad, Umarga, Naldurg, Sholapur(302KM)-Tembhurni(390KM)-Jeur(416KM)-Karmala(455KM)-Miraj Goan-Arangoan(550KM)-Meherabad(552KM).

## ROUTE 3:

అలాగే షోలాపూర్ నుండి వయా డోండ్ మెహెరాబాద్‌కు చేరుకోవడం ఉభయకుశలోపరి అని ఇటీవల ఈ మార్గాన ప్రయాణించిన ప్రేమికులు తెలియజేస్తున్నారు.

***

# బాబా సందేశం

**Trust God completly and He will solve all your problems**

పరమాత్మను పరిపూర్ణంగా విశ్వసిస్తే, నీ సమస్యలన్నీ ఆయనే పరిష్కరిస్తాడు

–మెహెర్‌బాబా


**గౌరవ సంపాదకులు**

**మల్లాది కృష్ణానంద్**

**99595-53218,**

**malladisukku@gmail.com**


## మనవి

**మీ వ్యాసాలు, ఇతర సమాచారం మాకు ప్రతినెల 10వ తేది లోపల పంపవలసింది. పత్రికను ప్రతినెలా 26న పోస్టు చేస్తున్నాం. 28వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**


**ఉత్తర ప్రత్యుత్తరాలకు**

ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218


## లోపలి పేజీలలో...


| | |
|---|---|
| 1. సంపాదకీయం | 5 |
| 2. 52వ అమరతిథి | 6-14 |
| 3. సమాధిలో తైలవర్ణ చిత్రం | 15 - 16 |
| 4. 1969 | 17 -18 |
| 5. నివాళి | 19 |
| 6. లార్డ్ మెహెర్ | 20-28 |
| 7. మెహెరాబాద్ సహవాస్ | 29 - 31 |
| 8. జమా ఖర్చులు | 32-35 |
| 10.స్మృతిపథంలో... | 36-38 |
| 11.జీవిత సభ్యత్వం | 40 |


## ముఖ చిత్రం

**సమాధిలోని అవతారుని చిత్రంపై ప్రత్యేక శీర్షిక** **పేజి 15లో తప్పక చదవండి !!**

Please visit : www.srimeherbaba.com

# మరపురాని ప్రేమికులు

బాబా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ, నిరంతరం బాబా నామస్మరణలో గడిపిన ప్రేమికులు శ్రీమతి మంత్రమూర్తి లక్ష్మి 2021 జనవరి 6న, శ్రీ పండుగ రమణ, హైదరాబాద్, శ్రీ మెహెర్ ప్రజ్వల్, విజయనగరం, జనవరి7న, శ్రీమతి గిరిజారాణి, ఏలూరు, జనవరి 9, శ్రీ ఉమేష్, సికింద్రాబాద్ జనవరి 11 ఆకస్మికంగా తుదిశ్వాస వదిలి, స్థానిక ప్రేమికులను ఆశ్చర్యపరిచారు. వీరందరూ నిస్వార్థంగా బాబాసేవ చేసుకుంటూ, అందరి మన్ననలు పొందిన ధన్యులు. శ్రీ పండుగ రమణ తనదైన శైలిలో పాటలు రాసుకుని పాడుకుంటూ పలువురికి బాబావారి నామాన్ని వినిపించే ప్రయత్నం చేశాడు. 2019 బాబా జన్మదినోత్సవాలలో దాదాపు పలు బాబా కేంద్రాలు సందర్శించి, తన మాట-పాటల ద్వారా స్థానిక ప్రేమికుల్ని ఉర్రూతలూగించిన ధన్యుడు శ్రీ రమణ. శ్రీ ఏకనామం పద్మనాభ రావు గారి కుమారుడిగా సికింద్రాబాద్‌లోని తమ ఇంట్లోనే బాబా కేంద్రాన్ని ఏర్పాటు చేసిన నిరాడంబర బాబా ప్రేమికుడు శ్రీ ఉమేష్.








శ్రీమతి గిరిజారాణి, ఏలూరు, శ్రీమతి లక్ష్మి, శ్రీ బాలామణి, హైదరాబాద్, శ్రీ మెహెర్ ప్రజ్వల్ విజయనగరం, నిద్రలేచినప్పటి నుండి బాబా నామస్మరణలో గడిపేవారని, అందరినీ ప్రేమగా పలకరిస్తూ బాబా ఇచ్ఛ ప్రకారం నడుచుకున్నారని స్థానిక బాబా ప్రేమికులు తెలిపారు. అవతారుని సేవలో తరించిన వీరందరూ మరపురాని ప్రేమికులు.

***

# సంపాదకీయం ఆచరణ సాధ్యమే!!

1958 ఫిబ్రవరి 24. తెల్లవారితే ఫిబ్రవరి 25న అవతారుని 64వ జన్మదినోత్సవం. మెహెరాబాద్‌లో 1958 ఫిబ్రవరి 21 నుండి 26 వరకూ తెలుగు – గుజరాతీయుల సహవాస్ జరుగుతున్న రోజులవి. అవతారుని జన్మదినోత్సవంనాడు బాబా సమక్షంలో వున్న ఆనాటి తెలుగు ప్రేమికులు ఎంతటి అదృష్టవంతులో!! **బర్త్‌డేనాడు** బాబా పాదాలు కడిగే అవకాశం ఇప్పించమని తెలుగువారు బాబాను కోరారు. అందుకు బాబా సరే అన్నారు. ఐతే, ఆ రోజున అనేక కార్యక్రమాలు వున్నందున అందరికీ ఆ అవకాశం ఇవ్వడం సాధ్యం కాదన్నారు. కాబట్టి తెలుగు సహవాసీలలో నుండి 12 మంది స్త్రీలు, మరో 12 మంది పురుషుల్ని పాదపూజ కోసం ఎంపిక చేసుకోమని బాబా సూచించారు. పాదపూజ పూర్తయ్యాక అందరూ పూలదండ వేయొచ్చు, పాదాభివందనం కూడా చేయొచ్చని అన్నారు. ఆ రోజున ఆలింగనం ఇవ్వడం కుదరదన్నారు బాబా. ఐతే, ఆనాడు హాజరైన తెలుగు సహవాసీలు ప్రతిఒక్కరూ బాబావారి పాదపూజలో పాల్గొనాల్సిందేనని పట్టుపట్టారు. ఏ ఒక్కరూ వెనక్కి తగ్గలేదు. ఫలితంగా అందివచ్చిన అవకాశాన్ని చేజార్చుకున్నారని ప్రత్యేకంగా చెప్పాలా? ఈ విషయాల్ని గతనెల సంచికలో "మెహెరాబాద్ సహవాస్" ధారావాహిక సీరియల్‌లో పాఠకులు గ్రహించే వుంటారు. ఆ పిదప, బాబా మరో సూచన చేశారు. అదేమంటే, తన పుట్టినరోజునాడు సహవాసీలలో కొందరు రూ100/–, 50/–,10/– లేదా ఒక్కరూపాయినైనా ప్రేమకానుకగా ఇవ్వాలనుకుంటే, ఆ నగదు తనకు ఇవ్వొద్దు అన్నారు బాబా. మీరెంత డబ్బు నాకు ప్రేమకానుకగా ఇవ్వదల్చారో దాంతో బాబా సాహిత్య గ్రంథాలను కొనుగోలు చేయమన్నారు. వ్యక్తిగత ఆర్థిక స్తోమతనుబట్టి LISTEN HUMANITY వంటి పుస్తకాలను తీసుకోమన్నారు. ఆ పుస్తకాలను కొనలేని వారికి ఫ్రీగా ఇవ్వమన్నారు. అలాగే, మీ బంధుమిత్రులకు, మీ స్వగ్రామాల్లోని గ్రంథాలయాలకు అందజేసి బాబానామవ్యాప్తికి దోహదపడమన్నారు. LIFE AT ITS BEST వంటి చిన్ని పుస్తకాల ఖరీదు రూ. 1.50 మాత్రమే. అతితక్కువ ఖరీదు గల ఈ ప్రతులను వీలున్నంత మేరకు ఎక్కువ కొనుగోలు చేసి పలువురికి అందజేయమన్నారు. ఒకవేళ మీలో ఎవరైనా ఏమీ కొనలేని పరిస్థితిలో వుంటే ఏమీ బాధపడొద్దన్నారు. మీ ప్రేమ ప్రధానం అన్నారు. ఎవరైతే ఈ పుస్తకాలు కొన్నారో వాటిని బధ్రంగా దాచుకోకుండా, పలువురు చదువుకునేలా పంచిపెట్టమన్నారు.
**బాబావారి సూచన నేటికీ అనుసరణీయం. ఆచరణీయం. బాబావారి సాహిత్యాన్ని పలువురికి అందజేద్దాం. బాబా మాస పత్రికలకు బంధుమిత్రులను సభ్యులుగా చేర్పించుదాం!! తద్వారా బాబా నామవ్యాప్తికి దోహదపడదాం!!**

# 52వ అమరతిథి

## 2021 జనవరి 31



అవతార్ మెహెర్‌బాబా భౌతికంగా నేడు మన మధ్యన లేరు. కానీ, ఆయన తన భక్తులతో, ప్రేమికులతో నిత్య సహచరునిగా వున్నారు. మెహెర్‌బాబాను పిలిస్తే ప్రతిక్షణం పలుకుతున్నాడు. మనస్సులో అనుకున్నదే తడవుగా ఆయన తన ప్రేమికులకు మరింత చేరువగా వుంటున్నాడు. మెహెర్‌బాబా 1969 జనవరి 31న తన భౌతికదేహ త్యాగం చేశారు. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లా కేంద్రానికి సుమారు 5 కి.మీ. దూరంలో గల మెహెరాబాద్‌లో, చిన్న కొండపైన మెహెర్‌బాబా సమాధి వుంది. ఈ సమాధిని 1930వ దశకంలోనే మెహెర్‌బాబా స్వీయ పర్యవేక్షణలో నిరాడంబరంగా నిర్మించారు. 2021 జనవరి 31న మెహెర్‌బాబా 52వ అమరతిథి వార్షికోత్సవాలు జరుగుతున్నాయి. కరోనా మహమ్మారి వల్ల ఈ ఏడాది అవతారుని అమరతిథి ఆన్‌లైన్‌లో జరుపు కుంటున్నారు. బాబా ప్రేమికులను మెహెరాబాద్‌కు రావద్దని ట్రస్టు సర్క్యులర్ విడుదల చేశింది. ప్రతి ఏడాది బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో జనవరి 30 నాటికే బాబా సమాధి ప్రాంగణానికి చేరుకునేవారు. జనవరి 30, 31, ఫిబ్రవరి 1వ తేదీలలో మూడు రోజులు ప్రత్యేక అమరతిథి కార్యక్రమాలు ఇక్కడ జరుగుతాయి. కాగా, బాబా ప్రేమికులు ఎక్కడివారక్కడే వుండి మెహెరాబాద్‌లోని అమరతిథి కార్యక్రమాలు వీక్షించమనని బాబా ట్రస్టు ముందుగానే తెలియజేశింది. ఇది ఎవరూ ఎప్పుడూ ఊహించని విపరీతమైన పరిస్థితి. గత ఏడాది మార్చి చివరి వారం నుండి తలెత్తింది. ఏది ఏమైనా ఇదంతా అవతారుని లీలలో భాగమేనని బాబా ప్రేమికులు నమ్ముతారు. అవతార్ మెహెర్‌బాబా 1969 జనవరి 31 మధ్యాహ్నం 12 గంటల సమయంలో భౌతిక దేహత్యాగం చేశారు. కాబట్టి మెహెర్‌బాబా ప్రేమికులందరూ జనవరి 31న మధ్యాహ్నం 12 నుండి 12.15 వరకూ మౌనావతారుడైన బాబాను స్మరిస్తూ మౌనం పాటిస్తారు. అమరతిథి రోజున ఇదే అత్యంత ప్రధాన ఘట్టం.

**జనవరి 31 మధ్యాహ్నం 12 గంటల నుండి 12.15 నిముషాల సమయంలో బాబా ప్రేమికులందరూ మెహెరుడిని తలుచుకుంటూ అవతారుని దివ్యాశీశ్శులు పొందగలరు. ఇదొక అరుదైన మహత్తర అవకాశంగా భావించవల్సింది.** మెహెర్‌బాబా 1925 జూలై 10 నుండి మౌనంలో వున్నారు. మౌనంగా వుంటూనే ఆయన అనేక సందేశాలు సమస్త మానవాళి కోసం అందజేశారు. మౌనంగా ఆయన గాడ్ స్పీక్స్– **'భగద్వచనం'** అనే గ్రంథం రాశారు. ఇప్పటికే అనేక దఫాలు పునర్ముద్రితమైన ఈ గ్రంథం, కనీసం ఒకసారైనా చదవమని బాబా తన భక్తులను కోరారు. ఈ గ్రంధాన్ని మహాత్మాగాంధీకి, భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, ఇలా పలువురు పెద్దలు–ప్రముఖులకు సయితం బాబా భక్తులు అందజేశారు. అన్ని బాబా కేంద్రాలలో భగవద్వచనం ప్రతులు లభ్యమవుతున్నాయి. మెహెర్‌బాబా మానవ రూపంలో వచ్చిన సాక్షాత్తూ ఈ యుగావతారుడు, భగవంతుడు. భగవంతుడు మానవరూపంలో మన మధ్యకు వచ్చినప్పుడు ఏ యుగంలోనైనా ఆయన దరిచేరి, ఆదరించి, ప్రేమించిన వారి సంఖ్య పరిమితంగానే వుంది.

## అనంతమైన భౌతిక బాధలు

మెహెర్‌బాబా సమస్తమానవాళి కోసం భౌతికంగా అనంతమైన బాధలు అనుభవించారు. ఎన్నో సంవత్సరాలు ముందుగానే మెహెర్‌బాబా 1969 జనవరి 31న తన దేహత్యాగం గురించి అనేక సంకేతాలు ఇచ్చారు. 1969 ఏప్రిల్ 10 నుండి జూన్ 10 వరకూ మూడు నెలలు పూణేలోని గురుప్రసాద్ భవనంలో ప్రజా దర్శనం, సహవాస్ తన ప్రేమికులకు ఇస్తానని మెహెర్‌బాబా ప్రకటించారు. కానీ, 1969 జనవరి నెలలోనే ఆయన ఆరోగ్యం బాగా క్షీణించింది. ఆయన దేహంలోని రక్తంలో యూరియా శాతం అనూహ్యంగా పెరిగింది. ఇది పరిశీలించిన వైద్యులు మెహెర్‌బాబాను తక్షణం వైద్య పరీక్షల నిమిత్తం పూణేలోని పెద్ద ఆసుపత్రికి తరలించాలని కోరారు. కానీ, మెహెర్‌బాబా అందుకు అంగీకరించలేదు. ఆయన దగ్గర అతి సన్నిహితంగా వుండే ప్రేమికులు, బాబా మండలి సభ్యుల ఆవేదనను ఆయన సున్నితంగా తిరస్కరించారు.

**If you want me to drop this body, then take me to Pune!**
**Otherwise, don't talk of going there !!** అని బాబా సంజ్ఞలతో పూణేకి వెళ్ళడాన్ని వారించారు. అదేసమయంలో మండలివారిని బుజ్జగించే ధోరణిలో తన దర్శన సహవాస్ విషయమై ప్రస్తావిస్తూ నేను నా భక్తులకు, ప్రేమికులకు పడుకుని దర్శనమిస్తాను. అలాచేస్తే బాగుండదా?? అని ప్రశ్నించారు.

**"If I give my darshan to my lovers lying down,**
**would there be anything wrong in that, He asked"**

అలా ఏం లేదు బాబా. నీకు ఎలా వీలుగా వుంటుందో అదే మేమందరం కోరుకుంటాం అని, బాబా మండలి జవాబిచ్చారు. 1969 ఏప్రిల్ నుండి మూడు నెలల పాటు పూణేలో దర్శన సహవాస్ నిర్వహిస్తామని సమాచారం అందరికీ పంపారు. బాబా ఆరోగ్య పరిస్థితి బాగాలేదు కదా! ఈ పరిస్థితుల్లో బాబా దర్శన కార్యక్రమం సాధ్యమవుతుందా? వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తే ఎలా వుంటుంది అని బాబా మండలి వారు ఆందోళన చెందుతుంటే, ఇది గమనించిన అవతారుడు ఏమన్నారో తెలుసాండి!! ఈ దఫా తానిచ్చే ఆఖరి దర్శనం చాలా విభిన్నమైంది. మౌనావతారునిగా తానిచ్చే ఈ దర్శనం చిట్టచివరిది, అనన్య సామాన్యమైనదీ అన్నారు. **"It will be different from all darshans, and it will be the last in silence. It will be the darshan of darshans unparalleled"** అన్నారు. అలాగే మరో సందర్భంలో "ఏమీ ఆలోచించకండి. బాధపడొద్దు. ఈ నెలాఖరుకల్లా (జనవరి 1969) అంతా బాగు-బాగు" అని సందేశమిచ్చారు. **Don't worry. All will be well by the end of this month.** ఈ మాటల్లో నిక్షిప్తమైన గూఢార్థం మెహెరుని సన్నిహితులకు సయితం చివరిక్షణం దాకా గ్రహించ లేదు. జనవరి 10 నాటికి అవతారుని ఆరోగ్యం క్రమేణా క్షీణించసాగింది. **I am God and I suffer for everyone, but if you go on serving me as conscientiously as you are now, I will get well** అని బాబా అన్నారు. జనవరి 12 తర్వాత బాబా మండలి హాలులోకి రాలేదు. రోజురోజుకీ ఆయన ఆరోగ్యం మరింత క్షీణించసాగింది. మండలి సభ్యురాలు డాక్టర్ గోహెర్ బాబాకు దగ్గరగా వుండి వైద్యసేవలు అందజేసింది. బాబా ఆరోగ్యం బాగాలేకున్నా తన మండలి ప్రేమికుడు, భావూ కల్చూరీ పుట్టినరోజు జనవరి 13న గుర్తుంచుకుని, ఆ రోజున బాబా భావూని దగ్గరగా తీసుకుని, ప్రేమతో తన ఆలింగనం ఇచ్చారు. మెహెరాబాద్‌లో జనవరి 14న సంక్రాంతి పండుగను వేడుకగా జరుపుకున్నారు. ఆ రోజున పాశ్చాత్య బాబా ప్రేమికుడు డాన్-ఇ-స్టీవెన్స్- బర్త్‌డే జరిపారు. బాబా అందరికీ స్వీట్లు పంచారు. డాన్‌కు బాబా తన ఆలింగనం ఇచ్చారు. జనవరి 24న బాబా ప్రేమికుడు ఆస్ట్రేలియన్ దేశీయుడు, కవి- పండితుడు ఫ్రాన్సిస్ బ్రాబజాన్ బర్త్‌డేని కూడా బాబా సమక్షంలో ఘనంగా జరిపారు. ఆ రోజున బాబా బ్రాబజాన్‌ని ప్రేమతో తన అక్కున తీసుకున్నారు. ఆ రోజు రాత్రిపూట భావూజీతో బాబా సంజ్ఞలతో ఇలా అన్నారు. 'తాను చెప్పేది శ్రద్ధగా వినమన్నారు. తన జీవిత చరిత్రని పద్యరూపకంలో రాయమని ఆదేశించారు. బాబా తీవ్ర అనారోగ్యంతో బాధలో వున్నారు. అంతటి బాధలో కూడా భావూజీని 800 పుటలలో తన జీవిత కథను, అందరికీ అర్థమయ్యేరీతిలో, సులువుగా వుండే భాషలో రాయమని, తాను సహాయపడతానని భావూతో అన్నారు. భావూ ఏది రాసినా తనకు నచ్చుతుందన్నారు. నీవు బాగా రాయగలవన్నారు.

## అవతారుని జీవిత చరిత్ర

**Listen carefully to what I say. I am giving you very important work. I want you to write my biography in verse.** ఈ మాటలు బాబా చెప్పేటప్పుడు ఆరోగ్యం బాగాలేక తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఆ బాధను చూడలేక "ఇప్పుడేమీ వద్దు బాబా, నీ ఆరోగ్యం కుదుటపడ్డాక అన్నీ వివరంగా చెబుదువులే" అని భావూ చెప్పే మాటల్ని బాబా లెక్కచేయలేదు. బాబా తన సంజ్ఞలు కొనసాగిస్తూ **I tell you honestly. Remember it, I like your writing very much. And when I like it, what more do you want** అని బాబా తిరిగి అన్నారు. బాబా ఆదేశాల ప్రకారం భావూజీ ఆ దరిమలా హిందీలో అవతారుని జీవిత చరిత్రను **'మెహెర్ దర్శన్'** పేరిట పద్యంలోనూ, వచనంలో **'మెహెర్‌ప్రభు'** అని రాశారు. అలాగే, ఇంగ్లీషులో ఈ గ్రంథం Lord Meher పేరిట లభిస్తోంది. అవతారుని సమగ్ర జీవితచరిత్ర, ఎనిమిది సంపుటాలలో, ఐదువేల పేజీలలో అత్యంత సరళమైన మధురమైన ఇంగ్లీషులో రాసిన ఈ గ్రంథం ప్రతిఒక్కరూ చదవాలి. ప్రతి బాబా ప్రేమికుని ఇంట్లో ఈ పుస్తకాలు ఉండటం ఎంతో అవసరం. తెలుగులో **"మెహెర్‌దర్శన్"** పేరిట Dr. MBVIR శర్మ 'ద్విపదలో' అనువదించారు. శ్రీ దశిక ప్రసాదరావు, మెహెర్‌బాబా పత్రిక వ్యవస్థాపకులు ఈ గ్రంధాన్ని ప్రచురించి బాబా ప్రేమికులందరికీ అందజేశారు. "It was His wish that I write it and by doing so, I have fulfilled His last orders to me" అని భావూ బాబా ఎడల తన విధేయత ప్రకటించారు. జనవరి 29 నాటికి బాబాకు Jolts –ఈడ్పులు వంటి వాటితో తీవ్ర బాధపడ్డారు. ఈ సమయంలో జనవరి 30న బాబా తన మండలి సభ్యుడు, అవతారునికి అత్యంత సన్నిహితుడైన ఏరుచ్‌ని పిలిపించి, మెహెరాబాద్‌లో వుంటున్న బాబా మండలి సభ్యులు పాద్రీ, ఛగన్‌లను మెహెరాజాద్‌కు (బాబా నివాసముంటున్న ప్రాంతం) ఏడు రోజులు వుండేలా వారిని రమ్మనమని కబురు పంపమన్నారు. ఈ కబురు అందగానే పాద్రీ మెహెరాజాద్‌కు వచ్చాడు. పాద్రీ మెహెరాజాద్‌కు వెళ్ళాక, మెహెరాబాద్‌లో వుంటున్న మహ్మద్ మస్తు స్థానిక బాబా ప్రేమికుడు– 'సిద్దూ'ని పిలిచి పాద్రీ గురించి వాకబు చేశాడు. సిద్దూ జరిగిన విషయమంతా క్లుప్తంగా మహ్మద్ మస్తుతో చెప్పాడు. ఈ మాటలు విన్న మస్తు, పాద్రీ రేపటికల్లా తిరిగి వస్తాడులే! అని అన్నాడు. **'దాదా' (బాబా)** కూడా రేపు ఇక్కడకు వస్తున్నాడు. గుస్తాద్‌జీలో (ఆయన 1958లో మరణించాడు) కలుస్తున్నాడని చాలా స్పష్టంగా మహ్మద్ మస్తు సిద్దూతో అన్నాడు. మహ్మద్ మస్తు మాటలు సాధారణంగా అందరికీ అర్థంకావు. అలాంటిది, ఈ నాలుగు మాటలు మాత్రం మహ్మద్‌మస్తు చాలా సుస్పష్టంగా పలికాడని సిద్దూ పేర్కొన్నాడు.

## Remember this I am not this body:

ఎప్పటిలాగా 1969 జనవరి 30న భావూజీ రాత్రి కాపలాదారునిగా బాబా సమక్షంలో వున్నారు. అప్పుడు సమయం రాత్రి 9.15 నిముషాలు. బాబా చాలా ఆనందంగా కనిపించారు. ఆరోగ్యంగానూ అగుపించారు. బాబా భావూజీతో సంజ్ఞలు చేస్తూ ఇది గుర్తుంచుకోండి!! **నేను ఈ శరీరాన్ని కాదు.** "Remember this -- I am not this body" అని ప్రకటించారు. అనంతరం – మండలి ప్రేమికుడు అలోబా తన డ్యూటీకై వచ్చాడు. నీవు వెళ్ళి విశ్రాంతి తీసుకో అని బాబా భావూతో అన్నారు. ఐతే, ఒక గంట తర్వాత తిరిగి బాబా, భావూజీని పిలిపించారు. **ఈ సమయంలో భావూజీతో బాబా కేవలం రెండు మాటలు మాట్లాడారు. याद रक** – గుర్తుంచుకో!! నేను ఈ శరీరాన్ని కాదు. **I am not this body.** నేను భగవంతుడిని అని స్పష్టంగా ప్రకటించారు.ఇలా మాతో బాబా చాలాసార్లు అన్నారు. కానీ ఈ దఫా బాబా **याद रक – I am not this body** అన్న మాటలు, నా హృదయానికి తాకేలా, బాబా తన సంజ్ఞలతోకాక, తన గొంతుతో చాలా స్పష్టంగా అన్నారని, భావూజీ ఆనాటి రాత్రి మాటలు తన జ్ఞాపకాలుగా చెప్పారు. "Although Baba's voice was feeble," Bhau recalled, "the sound was audible and clear, and its intensity and impact very, very forceful. It conveyed so great an impression, that my mind itself neither registered nor questioned the fact that Baba was speaking" "Yes- Baba is not the body" ` I said " Don't be anxious" Baba gestured. Don't worry about me. Go to sleep. బాబా గొంతు చాలా నీరసంగా వుంది. కానీ చాలా స్పష్టంగా నా చెవులకు బాబా మాటలు వినపడినాయి. నేను కూడా వినయంగా అవును బాబా, నీవు భగవంతుడివి. ఈ శరీరధారివి మాత్రం కాదన్నాను. ఆందోళన చెందవద్దు. నా గురించి ఆలోచించకండి. వెళ్ళి నిదురపో అని తిరిగి బాబా సంజ్ఞలతో తనకు సూచించారని భావూ అన్నారు. జనవరి 30న బాబా సుమారు నాలుగు గంటలు బాగానే విశ్రాంతి తీసుకున్నారు. ఈడ్పులయితే తరచు తీవ్రంగానే వచ్చాయి. మరో ఏడురోజుల తర్వాత నేను నూరు శాతం బాగవుతాను. ఇక ఆపై ఈ బాధలు నాకుండవు అని బాబా ఏరుచ్‌తో అన్నారు. జనవరి 31 ఉదయం 7 గంటలకు బాబా పురుష మండలందరినీ బ్రేక్‌పాస్ట్‌కు వెళ్ళమని చెప్పారు. స్త్రీ మండలి మెహెరా– మణి– తదితరులందరూ బాబా సమక్షంలో వున్నారు. బాబాని అమితంగా ప్రేమించే స్త్రీ మండలిలోని మెహెరా కానీ, వైద్యులు కానీ, బాబాకు దగ్గరగా వుంటే ఆ క్షణంలో బాబాకు ఎలాంటి ఆరోగ్య సమస్య వుండేది కాదు. అదే ఆ రోజూ జరిగింది. స్త్రీ మండలి సభ్యులు బాబా గదిని శుభ్రం చేశారు. అనంతరం, 8 గంటల సమయంలో బాబా తన

దగ్గరకి మండలి వారినందరినీ పిలిపించారు. బాబా వారందరితో ముచ్చటించారు. Goher is not responsible for My health. Remember this that, I am God, అని సంజ్ఞలతో మండలి వారిని హెచ్చరించారు. ఆ తర్వాత, తిరిగి తీవ్రమైన ఈడ్పులు వచ్చాయి. డాక్టర్ గోహెర్ ఇంజక్షన్‌లు యివ్వబోతుంటే, బాబా ఆమెను వారిస్తూ, నేను భగంతుడినన్న సంగతి మరచిపోవద్దన్నారు. పాద్రీ హోమియో పిల్స్ ఇచ్చాడు. పూణేలో వుంటున్న ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ గిండే కోసం కబురు పంపారు. కానీ, ఆయన సమయానికి రాలేదు. డాక్టర్ గిండే వచ్చాడా? అని బాబా తరచు అడిగారు. మధ్యాహ్నం 12 సమయంలో వచ్చిన తీవ్రమైన ఈడ్పులు బాబాను కుదిపివేశాయి. దాంతో ఆయన శ్వాస స్తంభించింది. ఆ తర్వాత 12.40 నిముషాలకు అహ్మద్‌నగర్ నుంచి బాబా కార్యదర్శి ఆదీ.కె.ఇరానీ, డాక్టర్ గిండే ఇద్దరూ వచ్చారు. అనేక దఫాలు చర్చలు జరిపాక, మండలి సభ్యులందరూ మెహెరుడ్ని మెహెరాబాద్‌కు ఆయన ముందుగా నిర్మించుకున్న సమాధి ప్రాంగణానికి తీసుకెళ్ళాలని నిర్ణయించారు. ఈ మేరకు బాబా ప్రేమికులందరికీ టెలిగ్రాంలు పంపారు. పలు దినపత్రికలు ఈ వార్తను విస్తృతంగా ప్రచురించాయి. ఆకాశవాణి, బిబిసి ప్రసార మాధ్యమాలు కూడా తమ వార్తలలో బాబా భౌతిక దేహత్యాగం గురించి ప్రసారం చేశాయి. సాధారణంగా మానవ మృతదేహాన్ని, శ్వాస ఆగిన తర్వాత కనీసం 20 గంటల్లో సమాధి లేదా ఖననం చేయాలి. ఈ విషయమే ప్రముఖ వైద్యులు డాక్టర్ గిండే ప్రస్తావిస్తూ, ఫిబ్రవరి ఒకటో తేదీ ఉదయం 10 గంటలకు బాబాను సమాధిలో వుంచాలన్నారు. ఐతే, బాబా ఆఖరి దర్శనం కోసం దేశం నలుమూలల నుండి ఎందరో ప్రేమికులు వస్తున్నామని, అప్పటిదాకా వేచి వుండాలని, అనేక విజ్ఞప్తులు ట్రస్టువారికి అందాయి. అలాగే, ఎందరో విదేశీయులు సయితం తాము బయల్దేరామని, తాము వచ్చేదాకా సమాధి కార్యక్రమాన్ని వాయిదా వెయ్యాల్సిందిగా అభ్యర్థనలు కోకొల్లలుగా వచ్చాయి. మెహెరాబాద్‌లో డాక్టర్ గిండే మాత్రం ఈ వాయిదా విషయంలో సముఖంగా లేరు. ఎందరో ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి ఆనాడు అవతారుని దివ్యదర్శనం పొందారు. ప్రభుత్వ ఆఫీసుల్లో పనిచేసేవారు, సెలవలు వుండీ లేక తగిన అనుమతి తీసుకోకుండా కట్టుబట్టలతో హుటాహుటిని మెహెరాబాద్ చేరిన వారెందరో!! అలా ఆనాడు హుటాహుటిన మెహెరాబాద్‌కు బయల్దేరిన వారి సంఖ్య అసంఖ్యాకం అనొచ్చు. ఐతే, డాక్టర్ గిండే, ఫ్రాన్సిస్ బ్రాబజాన్‌లు త్వరగా బాబా సమాధి కార్యక్రమం ముగించాలని గట్టిగా పట్టుపడుతున్నారు. అంతే పట్టుదలతో మరికొందరు బాబా మండలి సభ్యులు దూర ప్రాంతాలనుంచి విచ్చేసే బాబా ప్రేమికులకోసం

కొంతసేపు నిరీక్షించాలని పట్టుపట్టారు. ఏదైతేనేమి వీరి విజ్ఞప్తి చివరాఖరకు అంగీకరించడమైంది. బాబా ముందుగా ప్రకటించినట్లు I will give darshan lying down అన్న మాటలకు అర్థం మండలి వారికి, బాబా ప్రేమికులకు ఆనాడు అర్థమయింది. ఫిబ్రవరి ఒకటో తేదీన బాబా సమాధి కార్యక్రమం నిర్వహించాలనుకున్నా ఏ రోజు కారోజు వాయిదా వేస్తూ అవతారుడి ప్రేమికుల కోసం, ఆయన ఆఖరి భౌతిక దివ్య దర్శనం కోసం ఏడు రోజుల పాటు ఉంచారు. వైద్యులు ఆందోళన చెందినట్లు అవతారుని దేహంలో ఏడు రోజులలో ఎలాంటి మార్పు కనపడలేదు. మెహెర్‌బాబా పడుకుని దివ్య దర్శనం ఇస్తున్నట్లుగానే ఆనాటి దృశ్యం చూసిన వారు చెప్తారు. మెహెరుడి వదనం ఎంతో ప్రశాంతంగా వుంది. ఆయన ముఖ వర్చస్సు పచ్చని పసిడి కాంతులీనుతూ వుంది. అవతారుని ఆఖరి దర్శనం పొందిన కొందరి అదృష్టవంతుల్లో ఈ రచయిత కూడా వున్నాడు. అప్పటికి నా వయస్సు పది సంవత్సరాలు. ఆరవ తరగతి చదువుతున్నాను. బాబాని సమాధిలో వుంచిన తర్వాత మూడవ రోజున మేం నరసరావుపేట నుండి మెహెరాబాద్‌కు చేరుకున్నాం. అలావెళ్ళిన మేం ఏడవ రోజు వరకూ మెహెరాబాద్‌లోనే వున్నాం. బాబా సమాధి దగ్గర బాబా చాలా ప్రశాంతంగా నిదురపోతున్నట్లే అగుపించారు. హరికెన్‌మోర్ బాబా ప్రార్థనలు ప్రతిరోజు ఉదయం 7 గంటలకు చదివేవాడు. అలాగే, కేశవనారాయణ్ నిగం, మెహెర్ చాలీసా చదివారు. బాబా ట్రస్టు విచ్చేసే ప్రేమికులకు కనీస సౌకర్యాలు కల్పించలేక పోతున్నామని, అందుకు తామెంతో చింతిస్తున్నామన్నారు. అందుకు తమదే పూర్తి బాధ్యతగా పేర్కొంటూ, బాబాని దర్శించుకున్న వారందరూ దయచేసి వారి వారి స్వగ్రామాలకు తిరిగి వెళ్ళమని విజ్ఞప్తులు చేశారు. ఐతే, ఎవరు వెళ్తారు. బాబా సమాధి కార్యక్రమం పూర్తయ్యే వరకూ ఎవరూ అక్కడ్నుంచి కదలడానికి సుతారామూ సుముఖత చూపలేదు. మెహెరుని దేహం decomposition అయ్యే పరిస్థితి ఉంటే సమాధి కార్యక్రమం వెంటనే చేపడతామని, లేదంటే విచ్చేసే భక్తుల కోసం సమాధి కార్యక్రమం వాయిదా వేస్తామని, డాక్టర్ గోహెర్ పరీక్ష చేస్తున్నారని, ఈ మేరకు ప్రతిరోజూ ట్రస్టు వారు మైకులో ప్రకటనలు చేసేవారు. ముందుగా, బాబాని ఏడురోజులు అలా సమాధిలో ఉంచుతారని ఎవరూ ఊహించలేదు. ఐతే, తమాషాగా అవతారుని భౌతిక దేహంలో ఎలాంటి మార్పులు లేకపోవడంతో, దూరప్రాంతాల నుంచి అనేక వ్యయప్రయాసలకోర్చి వస్తున్న ప్రేమికుల కోసం, వారికి వీలుగా, బాబా సమాధిని ఏ రోజుకారోజు వాయిదా వేస్తూ వచ్చారు. "ఈ భౌతిక బాధలకు రాబోయే 7 రోజులలో తాను పూర్తిగా దూరమవుతానని బాబా పలుమార్లు హెచ్చరించారు". ఈ మాటలనే మండలి సభ్యులు బాబా సందేశంగా తీసుకుని 1969 ఫిబ్రవరి 7 శుక్రవారం మధ్యాహ్నం 12.15

నిముషాలకు సమాధి కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. మరోవిశేషం, జొరాస్టరు క్యాలెండర్ ప్రకారం అవతారుని జన్మదినం ఫిబ్రవరి 7 అయింది. ఫిబ్రవరి 7 ఉదయం 4.30 కల్లా అందరూ బాబా సమాధిని చేరారు. సరిగ్గా ఐదు గంటలకు మండలి వారితో సహా కొన్ని వేలమంది ఆ ప్రాంగణంలో వున్నారు. "సచ్చిదానంద పరమానంద –మెహెర్‌బాబా విజ్ఞానంద" నామ సంకీర్తన, నిరంతరంగా జరిగింది. ఆ రోజున తెల్లవారేసరికే వేలాది భక్తులు సమాధి వద్ద క్యూలు కట్టారు. కొందరికి రెండు నిముషాలపాటు సమాధిలో కూర్చునే అవకాశం కూడా ట్రస్టు కల్పించింది. ఫిబ్రవరి 7 మధ్యాహ్నం 12.15 ని॥ బాబా సమాధి అవుతున్నారని స్థానిక దిన పత్రికలు ముందుగానే విస్తృత ప్రచారం యిచ్చాయి. దాంతో దగ్గర్లోని ప్రజలు సయితం తండోపతండాలుగా బాబా సమాధి ప్రాంగణానికి విచ్చేసారు. మహ్మద్ మస్తుని కూడా బాబా దర్శనార్థం పాద్రి – సిద్దూలు స్వయంగా తీసుకొచ్చి అవతారుని దర్శనం యిప్పించి, తిరిగి ఆయన ఉండే గదికి తీసుకెళ్ళారు. సరిగ్గా మ॥ 12 గం హరికెన్‌మోర్ పర్వద్వీగార్, పశ్చాత్తాప ప్రార్థనలను తన సహజ ధోరణిలో ఉద్వేగంగా, బిగ్గరగా చదివారు. మ॥ 12.15 ని॥ బాబా సమాధి కార్యక్రమం ప్రారంభించారు. అందరికీ అవతారుని సమాధిపై 'మృత్తిక' చల్లే అవకాశం కల్పించారు. అనంతరం అవతారుని భౌతిక దర్శనభాగ్యం సాయంత్రం 5 గంటలకు పూర్తిగా దూరమయింది. ఏడు రంగుల అవతారుని పతాకాన్ని బాబాని సమాధి చేసిన ప్రాంతంలో కప్పారు. అనంతరం, బాబా స్త్రీ మండలి పుష్పగుచ్చాలు వుంచారు. ఆ పిదప బరువైన హృదయాలతో బాబా ప్రేమికులు మెహెరాబాద్ నుంచి తమ స్వస్థలాలకు తిరిగి వెళ్ళారు.

***

# నరసరావుపేట ప్రత్యేక సత్సంగ్‌లు

అవతార్ మెహెర్‌బాబా నరసరావుపేట బాబా కేంద్రంలో 2020 జనవరి 4న శ్రీమతి మల్లాది సుశీలా కృష్ణ గారిని గుర్తుచేసుకుంటూ ప్రత్యేక సత్సంగ్ నిర్వహించినట్లు శ్రీ వంకాయల అచ్యుతరావు తెలిపారు. అలాగే, జనవరి 16న శ్రీ మల్లాది గోపాల కృష్ణమూర్తి గారి జన్మదినోత్సవం సందర్భంగా స్థానిక బాబా కేంద్రంలో ప్రత్యేక సత్సంగ్ నిర్వహించామని, ఈ కార్యక్రమాలను శ్రీ మల్లాది రామారావు, మెహెరాబాద్ గారి పక్షాన బాబా కేంద్రంలో ఏర్పాటు చేశామని శ్రీ అచ్యుతరావు అన్నారు. 1960వ దశకంలో శ్రీ మల్లాదివారు నరసరావుపేట బాబా కేంద్రం ద్వారా మెహెరుడి పరిధిలోకి వచ్చారని, ఆ స్మృతులతో ప్రతి ఏడాది జనవరిలో స్థానిక బాబా కేంద్రంలో వారు సత్సంగ్ నిర్వహిస్తున్నారని శ్రీ వంకాయల అన్నారు.

పలువురు బాబా ప్రేమికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారని ఆయన తెలిపారు.



## ప్రధమ అమరతిథి

1970 జనవరి 31న, అవతారుని తొలి అమరతిథి రోజున మెహెరాబాద్‌కు విచ్చేసిన ప్రేమికులను ఉద్దేశించి, మెహెరామాయి ప్రసంగం ఇలా వుంది. కళ్ళలో తన్నుకొస్తున్న కన్నీటిని ఆపుకునే ప్రయత్నం చేస్తూ, ఆమె ఇలా అన్నారు. తొలి అమరతిథికి 1700 మంది ప్రేమికులు హాజరయ్యారని ఆనాటి రచనల ద్వారా తెలుస్తోంది.

*"O Beloved One, our Beloved Avatar Meher Baba! We, your loving children, have gathered today at Meherabad to fill our hearts with your love on this most sacred hill on earth where your Man-Form rests. We have also come to pay our homage to you and to greet you in the hearts of your lovers. May we be worthy of your very dear love for us. Your compassion is our strength, which sustains us. Your love is our life – it is yours. May we hold on to your daaman in complete surrender to your will.*

***Dear Meher pilgrims!***

*We are all gathered here in love to pay homage to Avatar Meher Baba, our Divine Beloved who loves us more than we can ever love ourselves. Let us forever say his Jai – not only say it with our lips but live it in our hearts, so that our lives become a living testimony to his Victory. Avatar Meher Baba Ki Jai!"*

## భారీ వర్షాలు

2020 జూన్, జూలైలలో మెహెరాబాద్‌లో అత్యధిక వర్షపాతం నమోదయ్యింది. ఎన్నడూ వూహించనంత వర్షాలు జూన్ నుండి నవంబరు నెలాఖరు వరకూ మెహెరాబాద్‌లో కురిసాయి. ప్రతి సంవత్సరం సగటున 60 సెంటిమీటర్ల వర్షపాతం ఈ ప్రాంతంలో నమోదవుతుండగా, ఈ ఏడాది అనుకోనిరీతిలో రమారమిన 122 సెం.మీ వర్షపాతం నమోదయినట్లు అధికారిక గణాంకాలు తెలియజేస్తున్నాయి. దీనివల్ల స్థానికంగా వున్న చెరువులు, వాగులు పొంగిపొర్లాయి. అంతేకాదు బాబా సమాధి లోపల వున్న కుడ్య చిత్రాలు, సమాధి గోడలు కూడా చెమ్మగిల్లాయి. లాక్‌డౌన్ కారణంగా జనసంచారం లేకపోవడంలో ఈ ప్రాంగణం అనేక రకాల పక్షులకు ఆలవాలమయ్యిందని స్థానిక ప్రేమికులు తెలియజేశారు.

# సమాధిలో తైలవర్ణ చిత్రం

## మణిజా లేఖాంశం




2020 డిశెంబరు మెహెర్‌బాబా సంచికలో శ్రీ మంత్రవాది తీసిన చిత్రం గురించి తెలుసుకున్నాం. కాగా, 1993 నుండి బాబా సమాధిలో ఉత్తర కిటికీ దగ్గర నేడు మనం చూస్తున్న అవతారుని తైలవర్ణ చిత్రం గురించి తెలుగువారు చాలామంది దగ్గర సాధికారిక సమాచారం లేదని మా అభిభావన. 1993లో ఓ ప్రేమికురాలు బాబా సోదరి మణీజాకు ఓ లేఖ రాసింది. ఆ లేఖలో బాబా సమాధిలో ఏర్పాటు చేసిన కొత్త ఫోటో గురించి విశేషం ఏమైనా వుందా? అని ఆమె అడిగింది. అందుకు మణిజా ఆ ప్రేమికురాలికి 1993 నవంబరు 22న సవివరంగా జవాబు రాస్తూ ఎన్నో ఆసక్తికర విశేషాలు తెలియజేశారు. మణిజా రాసిన లేఖ **"ది గార్లెండ్"** అనే అట్లాంటా నుండి ప్రచురించే ఓ న్యూస్‌లెటర్‌లో ఏప్రిల్ 1994లో ప్రచురించారు. ఈ శీర్షికలో మణిజా లేఖలోని అంశాలను మెహెర్‌బాబా పత్రిక పాఠకులకు ప్రత్యేకంగా అందజేసే ప్రయత్నం చేస్తున్నాం. ఇకపై దయచేసి ఆ విశేషాలు మణిజా మాటల్లోనే పరిశీలించగలరు.

***

మెహెరాబాద్‌లోని బాబా సమాధి లోపల గోడలపై 1938 ప్రాంతంలో స్విట్జర్‌లాండ్‌కు చెందిన ప్రముఖ చిత్రకారిణి హెలెన్ ధాహం అనే బాబా ప్రేమికురాలు కొన్ని కుడ్య చిత్రాలను చిత్రీకరించింది. ఆ చిత్రాలతోపాటు అవతారుని తెలవర్ణ చిత్రాన్ని ఒక ప్లే వుడ్ చెక్కపై చిత్రీకరించి, దాన్ని సమాధిలోపల ఉత్తరాన వున్న కిటికీలో అమర్చింది. సమాధి లోపలవున్న అనేక చిత్రాలకు కేంద్ర బిందువుగా ఈ చిత్రం వుండింది. ఆ దరిమిలా ఆమె తన స్వదేశం స్విడ్జర్‌లాండ్‌కు తిరిగి వెళ్ళాక, బాబానే స్వయంగా ఆ చిత్రాన్ని తొలగించమన్నారు. ఆ తర్వాత చాలాకాలం ఉత్తరాన వున్న కిటికీ ఏ ఫోటో లేకుండా ఖాళీగా వుంది. బాబావారి చిత్రం లేకుండా ఆ ప్రాంతం బోసిపోయినట్లుందని, మరో చిత్రం ఏదైనా ఏర్పాటు చేస్తే బాగుంటుందని, ఆనాటి

ప్రేమికుల అభిప్రాయాన్ని ప్రముఖ చిత్రకారిణి, రానోగెల్లి అనే పాశ్చాత్య ప్రేమికురాలు బాబా చెవిన వేశింది. ఐతే, **"ఇప్పుడు కాదు తర్వాత చూద్దాంలే"** అని క్లుప్తంగా బాబా అన్నారు. ఆ సమయంలో రానో ప్రక్కనే నేనూ వున్నాను. అంతేకాదు హెలెన్ ధాహం గీసిన చిత్రాన్ని రానో గెల్లీకి ఇచ్చి ఆ చిత్రంపైనే మరో చిత్రాన్ని గీయమన్నారు. ఆమె బాబా ఆదేశాలను విధేయతగా పాటించింది. నేడు ఆ చిత్రం దిగువ మెహెరాబాద్‌లో రాహూరి క్యాబిన్‌లో వుంది. 1950లో బాబా ఆ చిత్రానికి స్వయంగా ఆరతి పట్టారు.

## 2వ అమరతిథి

ఆ పిదప, మెహెరాబాద్‌లో రెండవ అమరతిథి జరుగుతున్న రోజుల్లో, సమాధి లోపల ఉత్తర కిటికీ దగ్గర బాబా చిత్రం ఏర్పాటుపై తిరిగి ఆలోచన వచ్చింది. ఈ విషయంలో నేడు సమాధిలో మనం చూస్తున్న అవతారుని తైలవర్ణ చిత్రాన్ని మెహెరామాయి ఎంపిక చేసింది. 1933లో బాబా యూరోపు పర్యటనలో భాగంగా ఫోర్టోఫినో అనే ప్రాంతంలో వుండగా తీసిన ఫోటో ఇది. అమెరికాలోని మెర్టిల్‌బీచ్ కేంద్ర వ్యవస్థాపకురాలైన ఎలిజెబెత్ పాటర్‌సన్ ఈ ఫోటోని తన కెమెరాతో తీసింది. మెహెరామాయికి ఎంతో ఇష్టమైన ఈ ఫోటోని ఎంపిక చేసి, దాన్ని ప్రముఖ అమెరికన్ చిత్రకారుడైన చార్లీ మోర్టాన్‌కు ఆమె అప్పగించింది. సమాధి లోపల గీసిన చిత్రాలన్నీ కూడా 1930 దశకం నాటివే. దాదాపు అదే సమాయనికి చెందిన బాబా చిత్రాన్ని మెహెరామాయి ఎంపిక చేయడం వెనుక అవతారుని లీల ఎంతైనా వుంది. ఐతే, 1971 నుండి చార్లీ మార్టిన్ గీచిన అవతారుని తైలవర్ణ చిత్రానికి మెహెరామాయి అనేక సందర్భాలలో మెహెరామాయి బాబాలో ఐక్యమయ్యే (1989) వరకు ఈ చిత్రానికి సంబంధించి ఆమె అనేక సూచనలు చేసింది. అనంతరం, 22 సంవత్సరాల వ్యవధి తర్వాత, చార్లీ మార్టిన్ గీచిన తైలవర్ణ చిత్రాన్ని 1993 మార్చిలో సమాధిలోపల ఉత్తర కిటికిలో ఏర్పాటు చేశారు. ఇదేదో గొప్ప చిత్రమని, ఇంతకుమించిన చిత్రం మరొకరు గీయలేరని నేను అనడం లేదు. కాని అవతారుడ్ని అమితంగా ప్రేమించిన మెహెరామాయి ఆమోదం తెలిపిన చిత్రంగా నాకు ఈ తెలవర్ణ చిత్రం అత్యంత ప్రధానమైందని, మణిజా తన లేఖ ముగించారు. ఇదండీ సంగతి!!. మీ స్పందన తెలియజేయగలరు.


## మెహెర్‌బాబా పత్రిక

**అవతార్ మెహెర్‌బాబా సందేశవ్యాప్తికి అంకితమైన పత్రిక మెహెర్‌బాబా. మీ బంధువుల్ని, స్నేహితులకు పత్రికను బహుమతిగా పంపండి. దయచేసి వార్షిక సభ్యత్వం బకాయిలను తక్షణం చెల్లించండి. –ఎడిటర్**

# 1969

## 1940వ దశకంలో జరిగిన సంఘటన ఇది

శ్రీ ఎం.ఆర్.ధాకేఫాల్కర్ అవతారునితో 1920వ దశకం నుండి మెహెరాబాద్ ఆశ్రమంలో వున్నాడు. ఈయన్ని క్లుప్తంగా ధాకేజీ అని పిలుస్తారు. బాబాతో సన్నిహితంగా గడిపిన ప్రేమికులలో శ్రీ ధాకే ఒకరు. బాబాతో గడిపిన రోజులలో జరిగిన అనేక ఆసక్తికర సంఘటనలకు శ్రీ ధాకే ప్రత్యక్ష సాక్షి. ఆ విశేషాలన్నింటినీ ఆయన **"ఇన్ ది కంపని ఆఫ్ అవతార్ మెహెర్‌బాబా"** పేరిట ఒక చిన్న గ్రంధాన్ని ఆయన ప్రచురించారు. ఈ గ్రంధంలో మెహెర్‌బాబా తన భౌతిక దేహ త్యాగం గురించి సుమారు రెండున్నర దశాబ్దాల క్రితమే ఒక రైలు ప్రయాణంలో తమకు సూచించారని శ్రీ ధాకే ఈ గ్రంధంలో పేజి.115లో పేర్కొన్నారు. ఆసక్తికరంగా సాగే ఈ శీర్షికను ఇకపై ధాకేజీ మాటల్లోనే పరిశీలించండి. !!

*****

మెహెర్‌బాబాతో కలసి మేమందరం గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీ నుండి
మద్రాస్ వెళ్తున్నాం. ఇదొక సుదీర్ఘ ప్రయాణం.
ఆ రోజుల్లో రెండు రాత్రుళ్ళు, రెండు పగళ్లు ప్రయాణం అన్నట్లు ఉండేది
ఈ రైలు ప్రయాణం. ఇదిఇలా ఉంటే, ప్రయాణంలో బాబా మాతో
సరదాగా మాట్లాడుతూ ఏదైనా కథలు, జోక్సు లాంటివి చెప్పమన్నారు.
అలా అంటూనే, **నా మనస్సులో ఒక సంవత్సరం వుంది.**
ఆ సంవత్సరంలో ఒక గొప్ప సంఘటన జరుగుతుంది.
ఆ సంఘటనతో యావత్తు ప్రపంచం కూడా ఒక పెద్ద షాక్‌కు గురయ్యే
అవకాశం వుందన్నారు. ఆ సంవత్సరం ఏదో చెప్పిన వాళ్ళకి
ఐదు రూపాయలు బహుమతి ఇస్తానని బాబా ప్రకటించారు.
ఇందుకు బాబా ఒక క్లూ కూడా ఇచ్చారు.
"నా మనస్సులో ఉన్న సంవత్సరం 1950-1999 నడుమ వుందన్నారు" బాబా.
మాలో ప్రతి ఒక్కరూ వారి వారి ప్రయత్నం వారు చేశారు.
వారు ఊహించిన సంవత్సరాన్ని బాబా ఎదుట చెప్పారు.
ఐతే, మండలివారు చెప్పిన ఆయా సంవత్సరాన్ని బాబా అంగీకరించ లేదు.
ఆపై నా వంతు వచ్చింది. నేను ఒక్క క్షణంలో **"1969"** అని చెప్పాను.
వెంటనే బాబా ఆశ్చర్యంగా ఇది కరెక్ట్ అన్నారు.
నేనూ కూడా అదే సంవత్సరాన్ని నా మనస్సులో అనుకున్నానన్నారు బాబా.

అంత కరెక్టుగా నీవెలా చెప్పగలిగావ్? అని బాబా నన్ను ప్రశ్నించారు.
నేను చెప్పిన ఈ సంవత్సరం కరెక్టన్న సంగతి నాకిప్పటికీ తెలియదని
బాబాతో అన్నాను. బహుశా నీవే నాచేత ఆ సంవత్సరాన్ని చెప్పించావనుకుంటున్నాను.
నీవు ప్రకటించిన బహుమతిని నాకు ఇవ్వాలని
నీవే నాకు ఆ ఆలోచన కల్గించావని నేను అనుకుంటున్నానని అన్నాను.
ఆ సంవత్సరాన్ని నీవెలా ఊహించావో అందరి ఎదుట చెప్పమన్నారు బాబా.
దాంతో నా మనస్సులోని మాట ఇలా చెప్పాను.
బాబా నీవు **1, 7, 9** సంఖ్యలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తావు కదా!!
అలాగే, ఆ అంకెలంటే నీకు మక్కువ కూడా అని నా అభిప్రాయం.
కాగా, 1,9 అంకెలను నాకంటే ముందు కొందరు చెప్పారు.
ఇక మిగిలినది **7** కాబట్టి, ఆ సంఖ్య వచ్చిన సంవత్సరంగా 1969 అని అన్నానన్నాను.
1969లో అన్ని అంకెలను కలిపి కూడితే 7 వస్తుందని చెప్పాను.
ఆ తర్వాత మీరు నాకు బహుమతి ప్రకటించారు అని అన్నాను.

*****

1969 జనవరి 31న బాబా భౌతిక దేహాన్ని వదిలినప్పుడు 1969కి బాబా ఇచ్చిన ప్రాధాన్యత మాకు అర్థమైంది. యావత్తు ప్రపంచం ఆ రోజున ఉలిక్కి పడింది. ఆ మాదిరిగా బాబా తన భౌతిక దేహ త్యాగం గురించి కొన్ని సంవత్సరాల ముందుగానే ఎన్నోవిధాల సూచించారు. మనమే గ్రహించలేకపోయాం అని ధాకేజీ అన్నారు. నిజమే కదా!!

*****

# మెహెర్ సుధాకర్ యూట్యూబ్ ఛానల్

ఆన్‌లైన్ సహవాస్, సత్సంగ్ నిర్వహించాలనుకునే బాబా కేంద్రాల నిర్వాహకులకు తాము తగిన సాంకేతిక సహాయం అందిస్తానని శ్రీ మెహెర్ సుధాకర్ తెలియజేశారు. కోవిడ్ 19 సమయంలో తెలుగునాట గల పలు బాబా కేంద్రాల తరఫున 2020 మార్చి నుండి రమారమిన 60 ఆన్‌లైన్ సహవాస్‌లు తాము నిర్వహించినట్లు శ్రీ సుధాకర్ (**90308 33930**) తెలిపారు. తమ ఛానల్‌ను నేటి వరకూ సుమారు 26 లక్షల, 19 వేల 535 మంది వీక్షించారని, 5 వేల మంది పైగా సభ్యులున్నారని ఆయన అన్నారు. మరికొంతకాలం కరోనా కట్టడి నియమాలు పాటించవల్సివున్నందున, తెలుగునాటగల బాబా కేంద్రాల నిర్వాహకులు వర్చ్యువల్ సహవాస్‌ల నిర్వహణ ద్వారా బాబా సత్సంగ్‌లు ఏర్పాటు చేసుకోవల్సిందిగా ఆయన కోరారు.





# నివాళి

మా తల్లి గారు శ్రీమతి సుశీలాకృష్ణ (1999 జనవరి 4న, అలాగే ఆమెకు తమ్ముడు, మా మేనమామ మెహెర్‌బాబా పత్రిక వ్యవస్థాపకులు, శ్రీ దశిక ప్రసాదరావు (2004 జనవరి 24) బాబాలో ఐక్యమయ్యారు. వారిని 2021 జనవరి సంచిక ద్వారా స్మరించుకుంటున్నాం.

మా తల్లి– సుశీలా కృష్ణ స్వీయ రచనలో వెలువడిన చక్కని పాట "నిన్ను మరచి ఉండ లేనయ్యా" అని అవతారుడిని స్మరిస్తూ ఆమె మనసారా ఆలాపించే కీర్తనను, ఆమెను స్మరించుకుంటూ ప్రచురిస్తున్నాం. **దయచేసి పరిశీలించగలరు.**

**– ఎడిటర్**

**భూలే బిసరే గీత్**

## "నిన్ను మరచి ఉండ లేనయ్యా"

నిన్ను మరచి ఉండ లేనయా,
పింపలవాసా, నిన్ను మరచి ఉండలేనయా,
నిన్ను మరచి ఉండలేను, కన్న తండ్రివగుటచేసి,
ఎన్న బోకు చేసిన నేరములను,
షిరీను కుమార మెహెరు బాబా ॥నిన్ను॥

సర్వమునకు కర్త నీవె,
సర్వమునకు భోక్త నీవె,
సర్వమునకు ఆర్త నీవు,
పరమ పురుష మెహెరు బాబా... ॥ నిన్ను॥

పూణా వాస మెహెరు బాబ,
నీవె నీడ మాకు బాబా,
కావుమయ్యా శరణు, శరణు, దేవ, దేవ.
మెహెరు బాబా... ॥ నిన్ను॥



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

**ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్, మెహెరాబాద్**

***(గత సంచిక తరువాయి)***

1931 సెప్టెంబరు 21 మధ్యాహ్నం బాబావారు కిమ్, క్రాస్కీ, మార్గరెట్‌స్టార్‌లకి సృష్టి విచిత్రాలని చెప్పారు. 'నా గదికి రండి', అని బాబావారు పిలిచారు. "ఎందుకని ఈ పిలుపో", అనుకొంటూ ఆ ముగ్గురూ ప్రభువు ముందు నిలిచారు. "కూర్చోండి", అని చెప్పి, చాలా సావధానంగా సృష్టి పరిణామక్రమాన్ని వివరించారు. భగవదవతరణ ఎలా జరుగుతుందో, ఎందుకు జరుగుతుందో విశదం చేశారు. దేముడు మనిషిగా పుట్టడం, మనిషి దేవుడిగా ఎదగడం గురించి కూడా తెలియజేశారు. క్రైస్తవ మతస్థులు కిమ్- క్రాస్కీ- స్టార్‌లకి వారికి ఈ విషయాలు అంతగా తెలీదు. అందుకనే బాబావారి ప్రతిమాటనీ శ్రద్ధగా విన్నారు. అయితే మార్గరెట్ క్రాస్కీకి అంతగా బుర్రకెక్కలేదని ఆవిడ మొహం చూస్తేనే తెలుస్తోంది. బాబావారది గమనించారో లేదో తెలీయదు కానీ, ఆవాళ్టి గోష్ఠికి ముక్తాయింపు చెప్పారు. "సృష్టి, పరిణామ దశ, పునర్జన్మ వంటి విషయాల గురించి బుర్ర పాడుచేసుకోకండి అన్నారు. ప్రేమ గొప్పది. భగవంతుడి గురించి ఎంతగా చెప్పుకొన్నా ఉట్టిదే అన్నారు. సృష్టి గురించి ఎంతగా తెలుసుకొన్నా ఆ జ్ఞానం, ప్రేమ ముందు ఎందుకూ కొరకాదన్నారు. భగవంతుడిని ప్రసన్నం చేయదు - మీ పుస్తక జ్ఞానమన్నారు. మీకు నేర్చుకోవలసినందీ, మీకు కావాల్సిందీ ఒక్కటి. అదే భగవంతుడిని మనసావాచా ఆరాధించడం, ప్రేమించడం. ప్రేమకంటే గొప్పది మరేదీ లేదు సృష్టిలో అన్నారు. 1931 సెప్టెంబరు 22న టెలిగ్రామ్ వచ్చింది. నాసిక్ నుంచి విష్ణు పంపాడు. బాబాజాన్ మరణవార్తని మోసుకు వచ్చింది ఆ తంతి. **"హజరత్ బాబాజాన్ సోమవారం 21వ తేదీ సాయంత్రం నాలుగున్నర ప్రాంతంలో తనువు చాలించింది',** అని వ్రాశాడు. మెహెరావతారుడ్ని భూమిపైకి తీసుకువచ్చిన పంచసద్గురువుల్లో ఒకరైన బాబాజాన్ పూణే నగరవాసి, ఆమె పుట్టు పూర్వోత్తరాలు స్థానికులకు అంతగా తెలియదు. ఆఫ్ఘన్ దేశస్థురాలనీ, మక్కా వెళ్ళి వచ్చిందని మాత్రం తెలుసు. **"పిలిచేతే పలికే"** అమృతవర్షిణి అని కీర్తించేవారు. ఏనాడూ ఆస్పత్రికి వెళ్ళని ఆ దొడ్డతల్లి సెప్టెంబరు 18న ససూన్ ఆస్పత్రికి వెళ్ళాల్సివచ్చిందట. వేలికి గాయమయిందని చిన్న ఆపరేషన్ చేశారుట.

ఆపరేషన్ అయిన మూడు రోజులకే శరీరం వదిలింది. బాబావారు ఏ ఆసుపత్రిలో పుట్టారో, అదే ఆస్పత్రిలో బాబాజాన్ ఆపరేషన్ చేయించుకోవడం విశేషం. ఇది యాదృచ్ఛికమా? లేక ఇదొక దైవీఘటనా? ఇదమిద్ధంగా చెప్పడం కష్టం. అవతారుడు కానీ, సద్గురువులు కానీ ఏ పనిచేసినా, ఏ కార్యక్రమంలో భాగమయినా, అందులో ఏదో పరమార్థం వుంటుంది తప్పకుండా అన్న సుజనుల అభిప్రాయంతో ఏకీభవించడం మన ధర్మం. విష్ణు టెలిగ్రామ్ వింటూనే బాబావారేమన్నారో తెలుసా! బాబాజాన్ తమ శరీరాన్ని వదిలివేయడం వల్ల అనేకానేక చిక్కులు ఎదురవుతాయి. ఎన్నో కష్టాలు వస్తాయి. పరిస్థితులు తారుమారు కావచ్చు. ఈ మార్పులు చాలా త్వరగా వస్తాయి. అందుకనే, నేను నిన్ననే వొక నిర్ణయం తీసుకొన్నా. పరిష్యా వెళ్ళాలన్న ఆలోచనకి స్వస్తి చెప్పాను. పరిష్యా నుంచి ఇండియా వెళ్ళాలని కదా అనుకొన్నాము. ఇప్పుడు ఇక్కడి నుంచి ఎకాయెకి అమెరికా ప్రయాణం కడ్తాను అన్నారు. ప్రపంచ పరిస్థితులని సమీక్షిస్తూ తీవ్ర మార్పులు రావచ్చున్న సంకేతాలు కనిపిస్తున్నాయన్నారు. భారతదేశం గురించి ప్రస్తావించి, గాంధీ గారు, ఇంకా ఎందరో నాయకులు లండన్ వచ్చారు కదా! బ్రిటీషు ప్రభుత్వం వాళ్ళతో సంప్రదింపులు చేస్తోంది. ఈ చర్యలు ఎటు దారితీస్తాయో అన్నారు. బ్రిటీషు దేశపు ఆర్థిక పరిస్థితి గందరగోళంలో పడిందన్నారు. రష్యాలో పరిస్థితులు అస్తవ్యస్తంగా మారాయి. చైనాలోనూ, జపాన్‌లో కూడా పరిస్థితులు దిగజారుతున్నాయి నానాటికీ. అంతా అధ్వానంగా తయారయింది ఆ రెండు దేశాల్లో కూడా. మరి ప్రపంచయుద్ధం వస్తోందన్న వదంతులు వినిపిస్తున్నాయి. ఎటుచూసినా వీటన్నింటి సంకేతం వొక్కటే. చాలా త్వరత్వరగా పరిస్థితులు మారబోతున్నాయని, బాబావారి భవిష్యవాణి విన్న ఆశ్రమవాసులకి నోట మాటరాలేదు. కాసేపు స్తబ్దుగా కూర్చొన్నారు. సద్గురువు శరీర త్యాగంతో ఒక శకానికి తెరపడింది. ఆ సంగతిని చెప్పకనే చెప్పారు బాబావారు. బాబాజాన్ ముద్దుబిడ్డ మెహెరుడు తల్లి పాలరాతి సమాధి నిర్మాణానికి నాలుగు వేల రూపాయల విరాళం ప్రకటించారు. ఈ సొమ్మును వెంటనే అందజేయమని ఘనీ గారికి టెలిగ్రామ్ పంపారు. ఇహ కూంబీమార్టిన్‌లో బాబావారి దినసరి కార్యక్రమం వో నిర్దిష్ట రూపంలో జరిగేది. హెర్బర్ట్, కిట్టీ, జిల్లా ప్రభృతులందరినీ విడివిడిగా కలిసేవారు. ఇందుకని వాళ్ళకి నిర్దిష్టమైన టైమ్ కేటాయించేవారు. హెర్బర్ట్‌కి మొదటి రెండు రోజులు లభించాయి. ఆయన తర్వాత వంతు కిట్టీ, జిల్లాలది. వాళ్ళకి మూడు రోజులు కేటాయించారు. నాలుగు రోజులు క్రాస్కీ, కిమ్‌లకి కేటాయించారు. వీరిద్దరిపట్ల ప్రత్యేకశ్రద్ధ చూపించారు. బాబావారి వద్దకి ఎవరు వచ్చినా, ఫలానా వారు వచ్చారని" ఆఘా ఆలీ చెప్పేవాడు. వాళ్ళని లోపలికి రావడానికి ప్రభువు అనుమతించేవారు. కిమ్, ఆమె మిత్రులు వచ్చినప్పుడు, ఆఘా ఆలీ ఏమనేవాడో తెలుసా? "బాబా! కిమ్ అండ్ కంపెనీ వచ్చారు", అనేవాడు.

కంపెనీ అంటే మిత్రులు అని అతగాడి భావన. హాస్యానికి అన్నా, తెలీక అన్నా, బాబావారు అతగాడి మాటని సార్థకం చేస్తూ కిమ్ బృందానికి "కిమ్‌కో"(కిమ్ కంపెని) అని నామకరణం చేశారు. అమెరికా వెళ్ళాలని నిర్ణయించారు కాబట్టి, ఆ ప్రయాణపు వివరాలు ఖరారు చేయాలి కదా! అందుకని ఛాన్‌జీని, రుస్తుంని బాబావారు తమ గదికి పిలుస్తున్నారు. ప్రయాణపు ఏర్పాట్లు చర్చిస్తున్నారు. ఇది మెరిడిత్‌స్టార్ వారికి నచ్చలేదు. నా పిలుపుపై ఇక్కడికి వచ్చిన మెహెరుడు నాకు అతిథి. అంటే, ఆయనకి నేనే బాగా దగ్గరవాడిని. నా తర్వాతే ఎవరయినా. ఛాన్ గారయినా, రుస్తుం గారయినా. వారందరూ నాతో సరితూగరు, అనుకొంటూ గుర్రుగా చూసేవాడు వాళ్ళకేసి. వాళ్ళిద్దర్నీ కొరుక్కు తినేయాలన్నంత కసి కనిపించేది స్టార్ వారులో. ఈ అహంకారం, అతిశయం ఏ పరిణామాలకి దారితీసిందో పాఠకులకి తెలుస్తుంది త్వరలోనే. ఆ ఘడియ వచ్చే వరకూ కాస్తంత వోపికగా ఎదురు చూడాలి. బాబావారి దైనందిన జీవిత విశేషాలు మనకి అందుతున్నాయి అంటే, ఛాన్జీ ప్రభృతులకి మనమందరం ఎంతో రుణపడి వున్నామనాలి. ఏ రోజున ఎక్కడున్నా, ఆనాటి విశేషాలని డైరీలో వ్రాయాలన్నది ప్రభువు ఆజ్ఞ. ప్రభువు ఉవాచని తూ.చ. తప్పకుండా వ్రాసుకోవాల్సిందే. రాత్రి నిద్ర పోయేముందు కాగితంపై వ్రాసిపెట్టుకొని, ఉదయాన్నే ప్రభువుకి చూపించడం, తప్పులు సరిదిద్దాక టైపు చేసి, పదిలంగా దాచడం మండలి వారి నిత్యకృత్యం. ఈ డైరీలని భద్రపరిచి భావితరాలకి అప్పగించిన ధన్యజీవి -పెద్ద ఆలీ. సరే ప్రస్తుతాంశంలోకి మళ్ళీ వస్తే, ఛాన్జీ ఎప్పటిలా, కూంబీమార్టిన్‌లో కూడా డైరీ వ్రాసేవాడు. ఈ డైరీ చదువుతుంటే, మనకి వో కొత్త సంగతి తెలుస్తుంది. ఆ సంగతి ఏమిటి అంటే, రుస్తుం గారితో ఛాన్జీకి అంతగా పడేది కాదని. రాత్రిళ్ళు భోజనం చేస్తుంటే, రుస్తుం గారు వేళాకోళం చేసేవాడట ఛాన్జీని. నలుగురితో కూర్చొని భోజనం చేస్తుంటే, నన్ను ఆట పట్టించడం బాగా లేదనుకొనేవాడుట ఛాన్‌జీ. నలుగురిలో నన్ను చులకన చేయాలనిచూస్తున్నాడీ మహానుభావుడు అనిపించేది. ఇద్దరూ వొకే గదిలో వుంటున్నారు ఇక్కడ ఆశ్రమంలో. పాఠకులకి గుర్తుంది కదా వాళ్ళ గది గొడ్లశాల దగ్గర. ఒకే గదిలో వుంటున్నా, వీరిద్దరి మధ్య మాటా-మంతీ అంతంత మాత్రమేనట. రుస్తుం నాతో ఎప్పుడో కానీ మాట్లాడే వాడు కాదని ఛాన్జీ వ్రాసుకొన్నారు తమ డైరీలో. ఏదిఏమైనా ఒకటి మాత్రం స్పష్టం. రుస్తుం – ఛాన్జీల మధ్య దూరం వాట్సన్ ప్రభృతుల దృష్టిలో పడింది. అదీ ఎలాగున జరిగింది అంటే, అదీ రుస్తుం పుణ్యమే. మీతో ఫోటో తీయించుకొంటాము అన్నాడుట రుస్తుం బాబావారితో. సరేనన్నారుట ప్రభువు. నాతో హెర్బర్ట్ కూడా దిగుతాడు ఫోటో. ఛాన్జీ మాత్రం వద్దు అన్నాడుట. ఇది గమనించిన వాట్సన్ దొర, ఛాన్జీపట్ల సానుభూతి చూపించాడుట. "అయ్యో" నీ సంగతి ఏమిటి? నువ్వు ఫోటోలో ఎందుకు దిగలేదు, అని అడిగాడుట. పాపం! ఛాన్జీ ఏం చేస్తాడు.

ఖిన్నుడయ్యాడు! రుస్తుంకి అంతా తన గురించే. నా గోడు పట్టదు అని విలవిలలాడాడు. ఇండియా నుంచి రాజపుతానాలో వస్తున్నప్పుడు కూడా రుస్తుం గారి తంతు యింతేనని డైరీలో వ్రాసుకొన్నాడు. గాంధీ గారితో సహా చాలామందిని బాబావారు కలిశారు. వాళ్ళ సమస్యలు విన్నారు. తగు సలహాలు యిచ్చారు. సాధారణంగా, బాబావారి వెంట ఛాన్జీ వుండేవాడు. అందుకని ఆ గోష్ఠుల వివరాలు డైరీలో వ్రాసుకొనేవాడు. ఒకోసారి బాబావారి చెంత వుండే వీలు చిక్కేది కాదు. మరి అటువంటప్పుడు, బాబా ఉవాచ నిక్షిప్తం చేసేది ఎలా? మిత్రుడు రుస్తుం సాయమడిగేవాడు. 'మిత్రమా! నువ్వు వున్నావు కదా ఆ సమయంలో. ఏం జరిగింది? ప్రభువు ఏం చెప్పాడు?' అని అడిగితే ఆ, వూ అనేవాడు తప్ప ఎక్కువగా ఏమీ చెప్పేవాడు కాదని ఛాన్జీ డైరీలో వ్రాసుకొన్నాడు. రుస్తుం–ఛాన్జీల మధ్య పొరపొచ్చాలు ఎలా వచ్చాయో, ఎందుకు వచ్చాయో చరిత్రకారుడు ప్రస్తావించలేదు కానీ, ఆనాటి తొలితరం మండలిలో సఖ్యత కొంచెం తక్కువన్న దాఖలాలున్నాయి. దరిమిలా కాలంలో కూడా పరిస్థితి యింతే. అప్పుడప్పుడు ఈ ఎడమొహం, పెడమొహం కూడా మెహెరుని శిక్షణలో భాగమేనంటాడు, మెహెరీశాన్ని ఔపోసన పట్టిన వో ఆస్ట్రేలియన్ ప్రేమికుడు మెహెర్ పాఠక లోకానికి రచయితగా చిరుపరిచితుడు. కాబట్టి, ఆయన పేరు అప్రస్తుతం. మనం మళ్ళీ ప్రస్తుతంలోకి వస్తే, కుంబెమార్టిన్‌కి వచ్చి పదిరోజులు అయింది. "ఇహ వెడదామా", అన్నాడు ప్రభువు. లండన్ రైలు ఎక్కారు. ఆఘా ఆలీ, ఛాన్జీ, టామ్, మార్గరెట్, కిమ్, ఔడ్రే ప్రభువు వెంట రైలు ఎక్కారు. 24వ తేదీ (సెప్టెంబరు 1931)న లండన్‌లో అడుగుపెట్టారు. కిట్టీ దేవీ యింటిలోనే మళ్ళీ బస. మెరిడిత్‌తో కలిసి రుస్తుం వచ్చాడు. దేవీ ఇంటి దగ్గరగానే బస కుదిరింది. కిట్టీ తండ్రి– జాన్, తల్లి హెలెనా బాబావారిని దర్శించి తరించిన పుణ్యదంపతులు. జాన్ గారికి ప్రింటింగ్ ప్రెస్ వుంది. ఆటలన్నా ఆసక్తి ఎక్కువ. బహుశా అందుకనే కామోసు, మెహెరుడు క్రికెట్ గురించి ముచ్చటించాడతనితో. 'పింగ్–పాంగ్' ఆట గురించి కూడా మాట్లాడాడు ఒక రోజున. కిట్టీ తల్లి హెలెనా తన ధర్మసందేహం తీర్చమని ప్రభువుని వేడుకొంది. నేను సామాన్యురాలిని. బ్రహ్మజ్ఞానం వగైరా నాకు తెలియవు. వొంటపట్టవు. మరి అవతారుడిని అంటున్నావు. ప్రభూ నిన్ను ఎలా ఆరాధించగలను. భగవత్ప్రేమన్నమాట వినడానికి బాగుంది కానీ, నేనెలా ప్రేమించగలను భగవంతుడిని, భగవదవతారుడివైన నిన్ను. అసలు అవన్నీ అవగాహన అయ్యేది ఎలా? అంటూ మనసులోని మాట నిర్మొహమాటంగా చెప్పేసింది. ప్రభువు చిరునవ్వాడు అబ్బే! ఇదేమంత బ్రహ్మవిద్య కాదు! భయపడకు! నేనున్నానుగా', అన్నారు. 'వో పనిచేయి,' అన్నాడు. ఏమాపని? అదేమీ పెద్ద పనికాదు, గాభరా పడకు. రోజూ ప్రార్థన చేస్తావు కదా!! అయితే, ప్రార్థన చేసేటప్పుడు, నా ఫోటో నీ ముందు పెట్టుకో అంతే. "బాబా! మరి నేను ఏసు ప్రభువు ఫోటో ముందు నిలబడి ప్రార్థన చేస్తుంటాను

రోజు". అలాగే కానీ! ఏసు కేసి తదేకంగా చూస్తూ ప్రార్థన చేయి. ఏసు ప్రేమ చాలా ఉన్నతాదర్శం. నా ఫోటో అయినా క్రీస్తు ఫోటో అయినా వొక్కటే. రెండింటిలో తేడా లేదు. అలా ఫోటో చూస్తూ ప్రార్థన చేస్తే నీలో భగవత్ప్రేమ
పెల్లుబుకుతుంది. నేను సాయం చేస్తాను. నీకోరిక తీరుస్తానుగా! హమ్మయ్య! నాకెందుకు దిగులు, అనుకొంది ఆ యిల్లాలు. ప్రభువాక్య పాలనకి నడుంకట్టింది. లండన్ నగరంలో దర్శనీయ స్థలాలకి బాబావారిని కిట్టీ తీసుకువెళ్ళింది ఆ మర్నాడు. ఆల్బర్ట్ మ్యూజియం, రేజెంట్స్ పార్క్‌లో జంతు ప్రదర్శనశాల, వెస్ట్ మినిస్టర్ అబ్బే, అజ్ఞాత సైనికుని సమాధి దర్శించారు. లండన్ నడిబొడ్డున వుంది వెస్ట్ మినిస్టర్ అబ్బే. ఇదొక ప్రాచీన చర్చి. బ్రిటీషు రాచవంశీకులు ప్రార్థన చేస్తారిక్కడ. బ్రిటీషు ప్రముఖులని ఈ చర్చి ఆవరణలోనే ఖననం చేస్తారు. ఈ మాట ప్రస్తావించగానే, బాబా వారన్నారు కదా! వారందరూ అదృష్టవంతులని, తమ రాకతో ఇక్కడ సమాధి అయిన వాళ్ళందరూ పునీతులయ్యారు" అని అన్నారు. ఇదేమాట అజ్ఞాత సైనికుని సమాధి దగ్గర కూడా అన్నారు. యుగావతారుడు వాళ్ళ సమాధికి దగ్గర కాసేపు నిలబడి, ఆశీర్వదించడం, పూర్వజన్మ సుకృతం వాళ్ళకి. బాబావారు లండన్ మెట్రో రైల్లో ప్రయాణించారు కాసేపు. లివర్‌పూర్ వీధి, ఆక్స్‌ఫర్డ్ సర్కస్, షెఫర్డ్స్ బుష్, పిక్కా ఢిల్లీ స్టేషన్లు దాటుతూ రైలు వెడుతుంటే, మండలివారికి అదొక వింతానుభవం. వింతలు చేసే సృష్టికర్తకి సరదా. లండన్ మెట్రో రైలునే ట్యూబ్ అనీ, సబ్‌వే అని అంటారు. చాలా భాగం భూగర్భంలో నడుస్తుందీ రైలు. అప్పట్లో, అంటే 1931 నాటికి, ఈ రైలుబండి ప్రత్యేక ఆకర్షణ లండన్‌లో. లండన్ నగరంలో వున్నన్ని రోజులూ బాబావారు ఆరింటికల్లా నిద్ర లేచేవారు. ఏడున్నరకి బ్రేక్‌ఫాస్ట్ కానిచ్చి, స్థానిక ఇంగ్లీషు పేపరు చూసేవారు. గడియారం తొమ్మిదికొట్టే సరికి 'నేను రెడీ!' అనేవారు. దర్శన కార్యక్రమం ప్రారంభమయ్యేది. రోజూ ఎందరెందరో వచ్చేవారు. తమ ధర్మ సందేహాలు వెలిబుచ్చేవారు. జ్ఞానమార్గం చెప్పమనేవారు. కొంతమంది అయితే తమ కష్టాలని ఏకరువు పెట్టేవారు. వాటి నుండి గట్టెంకించే మార్గం చెప్పమనేవారు. అందరి గోడూ వోపికగా వినేవాడు ప్రభువు. ఆయన ఉవాచ శక్తినిచ్చేది. చిరునవ్వుతో శెలవు తీసుకొనేవారు ఆ వచ్చినవారు. 25వ తేదీన (సెప్టెంబరు 1931) కిట్టీ భర్త, ఇద్దరు కూతుళ్ళు, బాబావారిని దర్శించారు. ఈనాటి అవతారుడు, క్రీస్తు రూపం అంటూ, కిట్టీ వూదరగొడితే, కాదనలేక వచ్చాడు ఆమె భర్త. అతని పేరు డెస్మండ్ టోన్ హార్ట్స్, దైవభక్తి ఎక్కువ. చర్చికి క్రమం తప్పకుండా వెడతాడు. భగవదారాధన చేస్తాడు. ఇదే మాట చెప్పాడు మెహరీశునితో. నేను రోమన్ కాథలిక్‌ని. ఏసుని నమ్ముతాను. ఆరాధిస్తాను. మనస్సు చంచలమయింది కదా. అప్పుడప్పుడు తప్పు చేస్తున్నాన్న భావన పట్టిపీడిస్తోంది. చేసిన తప్పు మళ్ళీ మళ్ళీ చేస్తుంటాను. నైతికంగా ఉన్నత

విలువలు పాటించాలన్న తపన నాది. కానీ ఏం చేయను బాబా. ఇదొక అలవాటో, గ్రహపాటో నాకు తెలియదు. ఊపిరి వున్నంత వరకూ, సక్రమ మార్గంలో వెళ్ళాలని వుంది. చర్చికి అంకితమై శేషజీవితం గడపాలన్నది నా వాంఛ. క్రీస్తు ప్రభువు నామస్మరణ చేస్తూండాలి తుదిశ్వాస వరకూ. ఇదే నా కోరిక, అంటూ మనసులోని మాట చెప్పాడు. "మంచిదే", అన్నారు బాబా. నీ యిచ్ఛ మంచిది అన్నారు. డెస్మండ్‌కి కొండ ఎక్కినంత ధైర్యం వచ్చింది. కిట్టీ పేరు చెప్పి వచ్చానిక్కడికి. ఈ ఇండియన్ ఋషి ఏం చెప్తాడో ఏం అంటారో అనుకొన్నాను. కానీ నాకు కితాబు యిస్తున్నాడే అంటే, నేను ఎంచుకొన్న మార్గం మంచిదే నన్నమాట అనుకొంటూ ఛాతీ విరుచుకొన్నాడు కించిత్ గర్వంతో. బాబావారొక హితవాక్యం చెప్పారు. ఆ మాట వింటుంటే ఇతగాడికి అనిపించింది కదా – ఇదేమిటి ఈయన ఇలా అంటున్నాడని. ఇంతకీ బాబా ఉవాచ ఏమిటి? మతంపై గురి వుండటం మంచిదే. మత సిద్ధాంతాలని పాటించు. అలా చేయడం కూడా అవసరం. కానీ మత సిద్ధాంతాలకీ, సంప్రదాయాలకీ కట్టుబడి వుండకు. కర్మకాండలకి అతీతంగా ఎదగాలి నువ్వు. అప్పుడే నీకు నువ్వుకోరుకొనే జ్ఞానమార్గంలో ముందుకు వెడతావు అని మెహెరీశుడు శెలవిచ్చారు. ఈ బాబా ఉవాచలో రుస్తుం, ఛాన్జీలకి కొత్తదనం కనబడలేదు. బాబా వారు ఎప్పుడూ చెప్పేది యిదే కదా. మతమన్నది కంటికి మసగ కాకూడదనే కదా ప్రభువు చెప్పేది ఎప్పుడూ అనుకొన్నారు. ఇస్లామ్ మతంలో దైనందిన జీవన సరళి నిర్దేశించే షరియత్‌ని బాబావారు ధాన్యం పొట్టుతో పోల్చారొకసారి. పొట్టుతీస్తే కదా బియ్యపు గింజ బయటపడేది. షరియత్ కర్మకాండలు పొట్టు వంటివి. అవి దాటి వెడితేనే ఆధ్యాత్మికత్వం వొంటబడుతుంది అని బాబావారు అనేకసార్లు పేర్కొన్నారు. మతం మంచిదే కానీ మతమౌఢ్యము తగదు అన్నది బాబావారి సందేశం, మన కిట్టీ పతికి నచ్చింది. కొత్త ధర్మసందేహం వచ్చింది. మత ధర్మాలని పాటించడం మంచిదేనంటూనే, మత పరమయిన సంప్రదాయానికి బానిస కావద్దా. అంటే ఏమిటి? మతం అంటే సంప్రదాయాలు. ఆ సంప్రదాయాలని వివరించే మత పెద్దలు, ఆ పెద్దల మాటల్ని వినాలి, పాటించాలి ఇదేగా చిన్నప్పటి నుంచీ మనం నేర్చుకొన్నది అని అనుకొంటూ, నాదొక సందేహం బాబా అన్నాడు. ప్రభువు అతగాడికేసి తేరిపార చూశారు. 'మీరు చెప్పింది బాగానే వుంది. కానీ బాబా, క్రైస్తవ మతంలో మంచి ఋషులు లేరంటారా? క్రైస్తవ ధర్మాలని ఔపోసన పట్టిన పెద్దలు, అదే పూజారులు లేరంటారా? బాబావారు చిరునవ్వు నవ్వారు, పిచ్చివాడా! ఎంత అమాయకంగా అడుగుతున్నావన్న అర్థం కనిపించింది ఆ చిరునవ్వులో రుస్తుం ప్రభృతులకి. బాబావారు అన్నారు కదా, క్రైస్తవ మతంలో ఋషులు, సాధువులు లేరా అంటే ఎందుకు లేరు. ఎందరో ఋషులున్నారు. నేను చెప్తున్నది వాళ్ళ గురించి కాదు. నేను మాట్లాడుతున్నది మీరు రోజూ కలిసే చర్చి

పెద్దల గురించి, చర్చిలో ప్రార్థనలు నిర్వహించే పూజార్ల గురించి. వాళ్ళని కలిసి కష్టసుఖాలు చెప్పుకొంటారు చాలామంది. వాళ్ళ మాట శిరోధార్యం నీ వంటి వారికి. అవునా! అని మెహెరుడు అడుగుతుంటే, డెస్మండ్ దొర గారు తలాడించారు. ఈ మాట నిజమే కదా అనిపించింది. బాబావారొక మాట శెలవిచ్చారు. పూజారులు అందరిదీ వొకటే ధోరణి అన్నారు. క్రైస్తవ మతమయినా, హిందూమత మయినా, ఇస్లామ్ అయినా పూజారులందరిదీ వొకటే మూస అన్నారు. దేశమేదయినా, మతమేదయినా పూజారులందరూ వాళ్ళకి నచ్చిన కట్టుబాట్లని ప్రజలపై రుద్దుతున్నారన్నారు. పూజారుల నిర్వాకం మరొకటుందన్నారు. తమ స్వార్థం కోసం అదే ప్రజలని తమ గుప్పిట్లో వుంచుకోవడం కోసం, పూజారులు, ఆచారాలు, సంప్రదాయాలు, పూజాదిక్రతువులు అంటూ వుక్కిరిబిక్కిరి చేస్తున్నారు ప్రజల్ని. ఈ మతం, ఆ మతం అని లేదు. అన్ని మతాల్లోను పూజార్లు చేస్తున్నది యిదే. ఇందువల్ల ఏమవుతోంది. మతం ఎందుకూ కొరగానిది అవుతోంది. మొండిదవుతోంది. ఒక్కమాటతో చెప్పాలంటే కుంటిదవుతోంది మతం అన్నారు. బాబా మాట నిజమేగా అనిపించింది మన డెస్మండ్ గారికి. ఆయన చర్చికి యిప్పటినుంచా, ఎప్పటినుండో వెడుతున్నారు. ఆదివారం వస్తే, శ్రద్ధగా చర్చిలో ప్రార్థన చేస్తున్నాడాయన. చర్చి పెద్ద చెప్పినట్లుగా చేస్తున్నాడు. ఆ ఆచారాలు, పద్ధతుల వల్ల ఏమయినా వొరిగిందా అని ఎప్పుడూ తర్జనభర్జన పడలేదు. ఇదిగో ఈ వేళ బాబావారు చెప్తుంటే, అనిపిస్తోంది ఈ ఆచార వ్యవహారాలు దండగనేమోనని. డెస్మండ్ మనసులో మాట బాబావారు ఆలకించినట్లున్నారు. అందుకనే చెప్పారతనికి. ఆచారాలు, క్రతువులు, కర్మకాండలు అన్నీ బియ్యం పొట్టువంటివని. ఈ ఉవాచకి అద్దం పడుతుంది- తెనుగు కవిత వొకటి. మతమన్నది కంటికి మసకయితే, మతం వద్దు, గితం వద్దు, మాయా మర్మం వద్దు. అల్లా వో అల్లా నీ పిల్లలమేమల్లా అన్నాడు మెహెరీశంలో పాడిన తెనుగు కవి, సుమారు ఐదు-ఆరు దశాబ్దాల క్రిందట. 25వ తేదీ (సెప్టెంబరు 1931) మధ్యాహ్నం క్వెంటన్ టోడ్ వచ్చాడు. వృత్తిరీత్యా నటుడు, డాన్సర్. లండన్, న్యూయార్క్ నగరాల్లో నృత్య ప్రదర్శనలకి దర్శకత్వం వహించి మంచిపేరు సంపాదించాడు. ఈ మధ్యనే ఆధ్యాత్మికచింతనలో పడ్డాడు. మార్గరెట్ క్రాస్కీని, మాబెల్ రయాన్‌ని నిరుడు కలిశాడు. వాళ్ళిద్దరూ డాన్సర్లేకదా. మంచి స్నేహం కుదిరింది. మాటలమధ్య మెహెర్‌బాబా ప్రస్తావన వచ్చింది. దేవదేముడాయన అన్నది క్రాస్కీ. అపర క్రైస్తు అంది. వోహో! అలాగైతే నేనూ కలుస్తానాయన్ని అన్నాడు క్వెంటన్. ఇదిగో ఈవాళ దర్శనం దొరుకుతోంది. ఇంతకీ ఇతగాడు ఏ దేశస్థుడు అని కదా పాఠకుల ప్రశ్న. క్వెంటన్ బ్రిటీషు దేశీయుడు. క్వింటన్ గారిని బాబావారి దగ్గరకు తీసుకువచ్చిన పుణ్యం క్రాస్కీది కాదు. అది మిలో షాటక్‌కి దక్కుతుంది. హొటల్‌లో మధ్యాహ్న భోజనం

చేస్తున్నప్పుడు వీరిద్దరికీ పరిచయమయింది. క్రాస్కీ, మాబెల్ కూడా అప్పుడు అక్కడే భోజనం చేస్తున్నారు. భోజనానంతరం ఎవరి దారిని వాళ్ళు వెళ్ళిపోతుంటే, మాట వరసకి షాటక్ అన్నాడు –'ఏమయ్యా, నాతో వస్తావా". మెహెర్‌బాబా వారి దగ్గరకి వెడుతున్నానని". బాబా గురించి క్రీస్కీ, మాబెల్ చెప్పిన సంగతి గుర్తుకు వచ్చింది క్వింటన్ గారికి. 'చూసివస్తే పోలే', అని పిలిచింది. అంతే షాటక్ వెంట కదిలాడు. బాబా వారు మేడ మీది గదిలో వున్నారు. మేడ మెట్లు ఎక్కుతుంటే కాళ్ళు వణికాయి మన మిత్రుడికి. ఏదో గాబరాగా అనిపించింది. చూద్దామా అనుకొంటూ అడుగు పెట్టాడు మెహెరీశుని గదిలోకి. బాబావారు చిరునవ్వుతో పలకరించారు. తమ ప్రక్కన కూర్చోమన్నారు. అతను చెప్పినట్లు చేశాడు. భుజం తట్టాడు ప్రభువు. అతని చేతిని సుతారంగా తాకారు. తన చేతిలోనికి తీసుకొన్నారు. క్వింటన్ వొళ్ళు పులకిరించిది. అదొక దివ్య స్పర్శ. దైవీ ప్రేమతరంగాలు ప్రవహించాయట అతనిలోకి. ఎంతోకాలం క్రిందట విడిపోయిన స్నేహితుడు మళ్ళీ దొరికాడన్న భావన కల్గిందట. ఈ మాట ఆయనే చెప్పాడు ఆ దరిమిలా. బాబావారి గదిలోకి అడుగు పెట్టానా, ఎదురుగా ప్రభువు కనిపించాడు మంచంపై కూర్చొని. మంచం కిటికీ ప్రక్కన వుంది. ప్రభువుకి చెరో ప్రక్కన ఇద్దరు నిలబడి వున్నారు. వాళ్ళే ఆఘా ఆలీ, ఛాన్జీలు. ఐతే నా దృష్టి మెహెరీశునిపై వుంది. వాళ్ళిద్దరూ ఉనికి నాకు పట్టలేదు, అని క్వింటన్ మహాశయుడు అంటాడు. గాని మెట్లు ఎక్కుతుంటే కాళ్ళు వణికాయన్నావు కదా, గదిలో అడుగుపెట్టాక ఏమని పిలిచింది అని అడిగారొకరు అతగాడిని. నా కేమయిందో తెలీదు అన్నాడు. నాకు బాబా వారు తప్ప యింకెవరూ కనబడలేదంటే నమ్మండి అన్నాడు. నన్ను చూస్తూనే ప్రభువు, రా ఇలా వచ్చి, నా ప్రక్కన కుర్చోమనడం', నేను కూర్చోవడం, అంతా యాత్రికంగా జరిగింది అన్నాడు. మెహెరీశుడినే చూస్తూ కూర్చున్నాను. ఎంతసేపు అలా కుర్చొన్నానో. నా ఎడమచేతిని తమ చేతుల్లోకి తీసుకొన్నారు ప్రభువు. అంతే ఏదో షాక్ తగిలినట్లయింది అది విద్యుత్ షాక్ కాదు ప్రేమ తరంగాల షాక్. ఒక్కసారిగా, నాలో పేరుకొన్న జడత్వం పోయినట్లయింది. దైవీ ప్రేమతో తడిసి ముద్దయ్యాను. వెంటనే అనిపించింది. ఏమి? బాబావారిని సేవించి తరించాలనిపించింది. ఎలా సేవించాలి? ఎలా వీలయితే అలా సేవించుదామనిపించింది. మెహెరుడు మౌనమూర్తి కదా. ఆ మౌనావతారుని సన్నిధిలో మూగవాడినయ్యాను. మేడ ఎక్కే ముందు ఎన్నో ప్రశ్నలు బుర్రని తొలిచివేశాయి. ఈ ప్రశ్న వేయాలి, ఆ ప్రశ్న వేయాలి అనుకొంటూ మేడ ఎక్కాను. మెహెరీశుని సన్నిధిలో ఆ ప్రశ్నలు గుర్తుకు వస్తే వొట్టు. అవన్నీ పిచ్చి ప్రశ్నలు. వాటికి విలువ ఏముంది అనిపిస్తోంది ఇప్పుడు, అన్నాడు క్వింటన్ దొరగారు. ఆవేళ్టి నుంచి రోజూ బాబావారి దర్శనానికి వచ్చాడు. రోజూ అంటే? రోజూ అంటే మెహెరీశుడు లండన్‌లో వున్నన్ని

రోజులూ దర్శనం చేసుకొని మహదానందం పడ్డాడు. మెహెరునిలో ఏమి చూశావు, 'నీ కేమనిపించింది? అని అడిగాడొక మిత్రుడు. రఫీమని చెప్పాడు "కళ్ళు". బాబా వారి కళ్ళలో ఏదో ఆకర్షణ వుంది. ఆయన సన్నిధిలో వున్నప్పుడు, అలా చూస్తూనే కూర్చున్నాను, అన్నాడు. 'మరి యింకా?" అడిగాడు మిత్రుడు. 'ఇంకా అంటావా? బాబావారిలో ఏదో శక్తి వుంది. ఆ శక్తి ఏమిటో యిదమిద్ధంగా చెప్పలేను. అదొక మహత్తరశక్తి అని మాత్రం చెప్పగలను అన్నాడు. మెహెరీశుని సేవించి తరించాలనిపించింది అని చెప్పానుగా. నా మొర ఆలకించినట్లుంది. ఆయనే చెప్పారొకరోజున. ఏమని? ఏమని అంటే, నేనాయనకోసం చాలా పనిచేస్తానన్నారు. నాకు ఈ వరం చాలని మనసా అంజలి ఘటించాను అంటూ తన కథ ముగించాడు క్వెంటన్ గారు. కిట్టీ దగ్గర పియానో నేర్చుకొంటున్న వో అమ్మాయి వచ్చింది ప్రభు దర్శనానికి వో రోజున. కిట్టీ చెపితేనే ఆ పిల్ల వచ్చిందనుకోండి. "నా ప్రక్కన కూర్చో", అన్నాడు మెహెరుడు. తలాడించింది కానీ ఆ చిన్నారిలో ఏదో బెరుకు, భయం కన్పిస్తున్నాయి. "ఏమయిందమ్మా" నేనున్నానుగా గాభరా పడకు, నీకేమీ కాదు. రా! ఇలారా! నా ప్రక్కనే కూర్చో, అని మెహెరుడు అంటూంటే, ఆ పాప కాస్తంత స్థిమితపడినట్లు కనిపించింది. 'నీ మనసులో మాట చెప్పు చిట్టి తల్లి, అని మెహెరుడు అడుగుతుంటే, ఆ అమ్మాయి భోరుమంది. బాబావారు అనునయించారు. తన పక్కనే కూర్చోబెట్టి, తల నిమిరారు. బాబావారి ప్రేమలో మునిగితేలింది. అంతే, ఎక్కడ నుంచి వచ్చిందో ధైర్యం కానీ, బాబావారి చెవిలో గుసగుసమంది. ఆమె ఏమి చెప్పిందో దగ్గరగా వున్న కిట్టీకి కూడా వినపడలేదుట అంటే అంత రహస్యంగా, తన గోడు విన్న వించుకొన్నది ఆ చిన్నారి. భుజం తట్టారు బాబావారు. కొండంత ధైర్యం వచ్చింది. గంటకి పైనే కూర్చొన్నది ఆ అమ్మాయి బాబావారి దగ్గర. ఈమె క్రిస్టియన్. క్రైస్తవ మతస్థురాలు, అన్నారొకరు. 'అయితేనేమి, అన్నట్లు చూశారు మెహెరీశుడు. 'ఏం పాపా! నన్ను ప్రేమిస్తున్నావా', అని అడిగారు. "క్రీస్తు ప్రభువుని నమ్మితేనే సరిపోదు. ఆ ఈశ్వరుడిని భక్తితో ప్రేమించాలి. అలా చేస్తున్నావా. నువ్వు వోపని చేయి ఈవాళ్టి నుంచి. క్రీస్తుని ఆరాధించు, ప్రేమించు" అన్నారు. "తప్పకుండా! మీరు చెప్పినట్లే చేస్తాను", అన్నది ఆ పియానో సంగీతం విద్యార్థి. **–సశేషం**

# మెహెర్‌బాబా పత్రిక కోసం

**శ్రీ యం. అశ్వర్థనారాయణ, అనంతపురం, (ప్రస్తుతం సిడ్నీ, ఆస్ట్రేలియా) మెహెర్‌బాబా పత్రిక నిర్వహణ ఖర్చుల కోసం 2021 జనవరిలో రూ 5,116/- విరాళంగా పంపారు. అలాగే, శ్రీ బ్రహ్మారెడ్డి, హైదరాబాద్ రూ. 1000/-విరాళంగా పంపారు. వీరిద్దరికీ పత్రిక పక్షాన ధన్యవాదములు. జైబాబా.**

# మెహెరాబాద్ తెలుగు-గుజరాతీల సహవాస్

## 1958 ఫిబ్రవరి 21 నుండి 26 వరకూ

గత నెల సంచికలో బాబా ఒక చిన్న ప్రశ్నను సహవాసీల నిర్ణయానికి వదిలిపెట్టారు. అదేమంటే సహవాసీలకు వ్యక్తిగత ఇంటర్వ్యూలు కావాలా? లేక బాబా సహవాస్‌లో పాల్గొనడమా? అనే విషయమై తగిన నిర్ణయం తీసుకోమని ప్రేమికులను కోరారు. నేను భగవంతుడిని, నాకు అన్నీ తెలుసు అని మీరు విశ్వసించినట్లైయితే, నా దగ్గరకు వ్యక్తిగతంగా వచ్చి మీ కష్టసుఖాలు చెప్పుకోవలసిన అవసరం ఏముందన్నారు. ఆధ్యాత్మికపథంలో వున్న వారికి నేను సూర్యునిలాంటి వాడినన్నారు. సూర్యుడు కొందరికి జీవనం, వెలుగు ప్రసాదిస్తాడు. కొందరు ఆ సూర్య భగవానుని కాంతిలో కాలి బుడిదైపోదామనుకుంటారు. కొందరు సూర్యకాంతిలో తగిన వేడిని కోరుకుంటారు. మరికొందరు సూర్య వేడిమి తాపానికి తట్టుకోలేక దూరంగా జరిగిపోతారు. ఇంకొందరు సూర్యుని వేడి నుండి తప్పించుకోవడానికై ఏదైనా చెట్టు నీడను చేరి తలదాచుకుంటారు. లేదంటే, ఎండలో నడిచేటప్పుడు తమ తలపై గొడుగు వేసుకుంటారన్నారు బాబా. ఈ రకంగా మూడురకాలైన వ్యక్తులు ఆధ్యాత్మిక పథంలో ఉన్నారని బాబా అన్నారు. ముందుగా వ్యక్తిగత ఇంటర్వ్యూలు కుదరదు అని సర్క్యులర్ పంపినా, వ్యక్తిగత ఇంటర్వ్యూలు కోరేవారిని ఉద్దేశించి బాబా ఇలా అన్నారు. మీ నిర్ణయం త్వరగా చెప్పండన్నారు. నేను మీ మధ్యలో ఉన్నా లేదా నా గదిలో ఉండి మీ వ్యక్తిగత ఇంటర్వ్యూలకు హాజరైనా, తనకు రెండూ సమానం అన్నారు. కాగా, బాబా సహవాస్‌లోనే పాల్గొనాలని ఏకగ్రీవంగా అందరూ ముక్తకంఠంతో కోరుకున్నారు. దాంతో మీలో ఎవరూ కూడా నా క్యాబిన్ వైపు రావడం, తొంగి తొంగి చూడడం, ఏదో రకంగా లోపలికి అడుగు పెడదామని, నా దృష్టిని ఆకర్షించాలని ప్రయత్నించవద్దని బాబా అన్నారు. తాను ఎవరినైనా పిలవాలనుకుంటే, వాళ్ళని తప్పకుండా తన గదికి పిలుస్తానన్నారు. అలాంటప్పుడు వాళ్ళు వచ్చేదాకా వేచివుంటాను కూడా అన్నారు. ప్రస్తుతం నల్లమందు మత్తులో ఉన్న సాధువులు గురించి చెప్పుకుందాం అన్నారు. ఆ అంశాన్ని గత వారంలో జరిగిన సహవాస్‌లో వివరంగా చెప్పానని అన్నారు. తగినంత సమయం ఉంటే ఆ అంశంపై మరింత లోతుగా చర్చించి ఈ రోజే పూర్తి చేద్దాం లేదా అవసరమైతే, రేపు కుడా ఈ అంశాన్ని కొనసాగిద్దామన్నారు. ఆ అంశం చెప్పేలోగా

భజన బృందాలవారిని ఏదైనా పాటలు పాడమన్నారు. దీనివల్ల సహవాసీలకు విసుగు రాకుండా ఉంటుందన్నారు. అదేపనిగా ప్రవచనాలు వరుసగా చెప్తుంటే మీలో కొందరికి నిద్రమత్తు వచ్చే అవకాశం ఉందన్నారు. తనకూ కొంత విరామం అవసరం అన్నారు. అందుకోసమే భజన గీతాలు లేదా ఏమైనా జోక్స్ విందామన్నారు. నల్లమందు సేవించిన సాధువుల సందేశం అద్భుతమైంది. నిర్వాహకులు మధ్యాహ్నం 3 గంటల కల్లా టీ తయారు చేయ్యాల్సివుంది. ఐతే, ప్రస్తుతం టీ సిద్ధంగా లేదు. అంతేకాదు ఈ నల్లమందు కథాంశం కూడా  సిద్ధంగా లేదన్నారు బాబా నవ్వుతూ. ఆ తరువాత ఈ నల్లమందు మత్తు సన్యాసుల గురించి కొన్ని పాయింట్లని మండలి సభ్యుడైన ఏరుచ్ చదివి వినిపించాడు. ఆ పిదప చాలామంది పురుషులు, స్త్రీలు సహవాసీలు టీ కోసం వెళ్ళారు. బాబా మాత్రం వేదిక మీదనే ఉండి భజన గీతాలను ఆలకించారు. నల్లమందు సన్యాసుల సందేశం మధ్యాహ్నం 3.45 నిముషాలకు తిరిగి ప్రారంభమైంది. అది పూర్తిగా చెప్పిన తర్వాత మత్తుమందు సన్యాసుల ద్వారా మంచి–చెడూ రెండూ ఒక్కసారిగా ఎగిసి పడతాయి. ఇదంతా కూడా నా లీల అన్నారు బాబా. ఇందులో ఎవరి తప్పు లేదు. నేను ప్రతి ఒక్కరిలో ఉన్నాను. ప్రతిఒక్కరితో  చేస్తున్నది, వారిని ఏపని చేయకుండా చేస్తున్నది నేనే అన్నారు.  ఆ పిదప సాయంత్రం 5.30 నిముషాలకు అవతారునికి ఆరతి పట్టారు. ఆ పిదప బాబా మాట్లాడుతూ “ధైర్యంగా ఉండండి, ఆనందంగా ఉండండి. నేను – మీరు వేరు కాదు. ఒక్కటే!! అని అన్నారు. ఈ అనంతమైన విశ్వం అనాదిగా నాకు చెందినది. ఏదో ఒక రోజున ఈ అనంత విశ్వం ప్రతిఒక్కనికి చెందుతుందని అన్నారు. గుర్తుంచుకోండి **“నేను – మీరు ఒక్కటే.  అంతేగాని, మీరు మరియు నేను ఒక్కటి కాదు” అన్నారు.** బాబా ఒకసారి లేచి నిలబడి, తిరిగి కూర్చుని ఇలా అన్నారు. రేపటి రోజున కార్యకర్తలతో సమావేశం అవుతున్నానన్నారు. ఆ సమావేశానికి కార్యకర్తలు సెంటర్లవారీగా కాకుండా, కార్యకర్తల బృంద నాయకులందరూ ఒక పెద్ద బృందంగా సమావేశం కావాలన్నారు. ప్రతి ఒక్కరూ “నేను బాబా కార్యకర్తనని” చెప్తారు. ఐతే, నేను అందరిని ఆ సమావేశానికి పిలవలేనన్నారు. నిర్వాహకులే సరైన కార్యకర్తలను ఎంపిక చేయాలని సూచించారు. ఈ సమావేశం రేపు మధ్యాహ్నం 3 నుండి 5 గంటల నడుమ జరుగుతుందన్నారు. కార్యకర్తలందరితో నిజమైన బాబా చేయడం అంటే ఏమిటి? బాబా కార్యకర్తలు అంటే ఏమిటి? అనే విషయాలపై క్షుణ్ణంగా చర్చిస్తానన్నారు. బాబా పని అంటే అది అవతారుని కార్యక్రమంగా జరగాలి. లేదంటే బాబా కార్యక్రమాన్ని చేపట్టకపోవడమే మంచిదన్నారు. కపటం, అహంకారం ఈ రెండూ తాను సహించనన్నారు. ఈ రెండు అంశాలపై కూడా రేపటి కార్యకర్తల సమావేశంలో చర్చిస్తానన్నారు. గత వారం ఎవరైతే కార్యకర్తల సమావేశానికి హాజరయ్యారో వాళ్ళు తిరిగి రేపటి రోజున ఈ సమావేశానికి రావల్సిన

పనిలేదన్నారు. అనంతరం సాయంత్రం 6 గంటల సమయంలో మెహెరాబాద్‌కు కారులో బాబా బయలుదేరి వెళ్ళారు. ఆ మర్నాడు, ఫిబ్రవరి 24 ఉదయం 8.20 నిముషాలకల్లా మెహెరాబాద్‌కు వచ్చారు. కాసేపు తన క్యాబిన్‌లో మండలివారితో ముచ్చటించి సరిగ్గా ఉదయం 9.30 నిముషాలకు బాబా వేదిక పైకి వెళ్ళారు. నాకు ఈ రోజున జ్వరం, జలుబుతో బాధపడుతున్నానన్నారు. కాగా ఈ రోజున గతవారంలో జరిగిన సహవాస్‌లో చెప్పినట్లుగా "స్ప్లిట్ ఐ" (Split I), ఆంతరంగిక అనుభవాలు, డివైన్ హలుసినేషన్స్ (Divine Halucination) అంశాల గురించి చెప్పాలనుకున్నా అన్నారు. అయితే ఈ అంశాల గురించి చర్చించాలంటే కనీసం మూడు గంటల సమయం కావాలి. కాబట్టి, ఆ అంశాన్ని ఈవాళ బాబా చెప్పడం లేదన్నారు. ప్రవచనం చెప్పడానికి సరైన సమయం కూడా కాదని బాబా అన్నారు. సహవాస్ పూర్తయ్యాక ఆ అంశాలని మీకు మీ బృంద నాయకులకు పోస్టులో పంపుతానని బాబా అన్నారు. ఈ అంశాలు చాలా ప్రత్యేకమైనవి. నేనుగా చెప్తున్నటువంటివి. ఇంతవరకూ ఎన్నడూ ప్రస్తావించని విషయాలు అన్నారు. ఆ తర్వాత "స్ప్లిట్ ఐ" ప్రవచనాన్ని ఏరుచ్ చదివి వినిపించాడు.

**-సశేషం**

# పత్రిక నిర్వహణ కోసం అందిన విరాళాలు

## 2020 జనవరి నుండి డిశెంబర్ వరకు

| | |
|---|---|
| 1. శ్రీ ఉపేందర్, వరంగల్ | రు. 5,000/- |
| 2. శ్రీ జగన్‌మోహన్‌రావు, హైదరాబాద్ | రు. 500/- |
| 3. శ్రీ వెంకట్‌రావు, విజయనగరం | రు. 500/- |
| 4. శ్రీ గౌరు మెహెర్ ప్రసాద్, శ్రీకాకుళం (ఆర్కైవ్స్ కోసం) | రు. 500/- |
| 5. శ్రీ బి. క్రిష్ణయ్య, హైదరాబాద్ | రు. 1,000/- |
| 6. శ్రీ నిరాకారరావు, హైదరాబాద్ | రు. 1,000/- |
| 8. శ్రీ చింతామణి, విజయనగరం | రు. 1,000/- |
| 9. శ్రీ బలరామయ్య, అనంతపురం | రు. 1,000/- |
| 10. శ్రీ బ్రహ్మారెడ్డి, హైదరాబాద్ | రు. 1,000/- |
| 11. శ్రీ అశ్వర్థనారాయణ, అనంతపురం. (సిడ్నీ, ఆస్ట్రేలియా) | రు. 5,116/- |
| **మొత్తం** | **రు. 16,116** |

# జమా ఖర్చులు

**2020 జనవరి నుండి డిశంబరు వరకూ**

| జమలు | రూ. పై | ఖర్చులు | రూ. పై |
|---|---|---|---|
| 1. వార్షిక సభ్యత్వం | 9,100.00 | ప్రింటింగ్ చార్జి | 61,790.00 |
| 2. డొనేషన్లు | 16,116.00 | డిటిపి చార్జి | 6,000.00 |
| | --------------- | అడ్రస్ స్టిక్కర్లు | 800.00 |
| | **25,216.00** | | |
| వడ్డీ వినియోగం | **43,374.00** | మొత్తం ఖర్చు | **68,590.00** |
| | ------------- | | |
| | **68,590.00** | | **68,590.00** |

**జమలు:**

వార్షిక సభ్యత్వం రూపేణా 2020 జనవరి నుండి డిశంబరురు దాకా రూ. 100/- చొప్పున మరికొందరు. 200/- చొప్పున మొత్తం రూ. 9,100/- వార్షిక సభ్యత్వం రూపేణా ముట్టినది. కాగా, మాస పత్రిక ప్రచురణ ఖర్చుల నిమిత్తం విరాళాల రూపంలో మొత్తం రు. 16,116/- అందినాయి. డొనేషన్లు అందజేసిన వారి వివరములు పేజి 31లో ప్రచురించడమైనది. ఆ మాదిరిగా నగదు మొత్తం రూ. 25,216/- జమయినాయి.

## ప్రింటింగ్ చార్జీలు పెంపుదల

**2020 జనవరి వరకూ ప్రతి 1000 కాపీలకు రూ 4800/- చొప్పున, అదనపు 100 కాపీలకు రు.480/- చొప్పున ప్రింటింగ్ ప్రెస్‌వారికి చెల్లించడమైంది. కాగా, 2020 ఫిబ్రవరి నుండి పేపరు, ప్రింటింగ్ రేట్లు పెరిగినందున, ప్రింటింగ్ చార్జీలను ప్రతి వెయ్యి ప్రతులకు గాను రూ. 5,800/- ప్రతి 100 అదనపు ప్రతులకు రూ 580/- చొప్పున చెల్లించాలని ప్రింటిగ్ రేట్లను సవరించినారు.** 2020 జనవరిలో 1200 ప్రతుల ప్రింటింగ్‌కు గాను పాత రేట్లు ప్రకారం రూ. 6,000/- చెల్లించడమైనది. కాగా, 2020 ఫిబ్రవరి, మార్చి నెలలో 1250 ప్రతులు ప్రింట్ చేయించడమైంది. మార్చి నెలలో ప్రెస్ నుండి పత్రికలు ముట్టినాయి కాని, పోస్టాఫీసులు పనిచేయలేదు. ఆ ప్రతులను స్థానికంగా ఉచితంగా పంపిణి చేయడమైనది. 2020 ఏప్రిల్, మే, జూన్ నెలలో కోవిడ్ కారణంగా లాక్‌డౌన్‌లో పత్రిక ప్రింట్ చేయించలేదు. ఐనప్పటికీ పత్రికను ఎప్పటిలా తయారుచేసి వాట్సప్, ఇ-మెయిల్‌లో సభ్యులందరికీ

పంపడమైంది. తిరిగి, 2020 జూలై, ఆగస్టు నెలలలో 1250 ప్రతులు, 2020 సెప్టెంబరు,అక్టోబరు నెలలలో 1200 ప్రతులు, 2020 నవంబరు, డిశెంబరు నెలలలో 1100 కాపీలకు ప్రింట్ ఆర్డర్ ఇవ్వడమైనది. గత మూడు సంవత్సరాలుగా వార్షిక సభ్యత్వం చెల్లించనివారి సంఖ్య అధికమవుతుండటంతో, నవంబరు, డిశెంబరు సంచికల కోసం ప్రింట్ ఆర్డర్ తగ్గించడమైంది. వాట్సప్‌లో అందరికీ ఎప్పటిలా పంపడమైనది. ఆ మాదిరిగా, మొత్తం ప్రింటింగు చార్జీలకై రూ 61,790/- చెల్లించడమైంది. హైదరాబాద్‌లోని శ్రీ సాయి శ్రీనివాస ప్రింటర్స్, ఖైరతాబాద్ ఫోన్:040-23392566 పత్రిక ప్రారంభపు సంచిక నుండి నేటి వరకూ ప్రతినెలా ప్రింట్‌చేసి అందజేస్తున్నారు. అలాగే డిటిపి చార్జీల కోసం ప్రతి నెలా రూ. 500/- చొప్పున ఏడాది మొత్తానికి రూ 6,000/-, ఎడహెసివ్ అడ్రస్ స్టిక్కర్ల కోసం రూ 800/- మొత్తం రూ. 6,800/-చెల్లించడమైంది.ఆ మాదిరిగా, పత్రికా నిర్వహణలో 2020 జనవరి నుండి డిశెంబరు వరకు పైన సూచించిన జమా-ఖర్చుల పట్టికలో తెలిపినట్లు మొత్తం ఖర్చు రూ **68,590.00** , ఆదాయం **25,216.00.** కాగా, బ్యాంకు వడ్డీ నిల్వల నుండి పైన పేర్కొన్న బిల్లుల చెల్లింపునకు రూ. **43,574/-** విత్‌డ్రాచేసి చెల్లించాలని ప్రతిపాదించడమైనది.

## జీవిత సభ్యులు చెల్లింపులు

2020 జనవరి నుండి డిశెంబరు వరకూ జీవిత సభ్యత్వం రూపేణా రు. 1000/- చొప్పున 22 మంది మొత్తం రూ. 22,000/-, నలుగురు పాక్షిక జీవితసభ్యత్వం రూ. 500/- చొప్పున మొత్తం రూ. 2000/- చెల్లించారు. కాగా, ఈ ఏడాది జీవిత సభ్యత్వం రూపేణా వసూలైన నగదు మొత్తం రూ. 24,000/- బ్యాంకు ఖాతాకు జమచేయడమైంది. జీవిత సభ్యులు చెల్లించిన మొత్తాన్ని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, **(ఐ.ఓ.బి)** సైనిక్‌పురి బ్రాంచ్, సికింద్రాబాద్‌లో ఫ్లెక్సీ-ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకం అకౌంట్ నెం. **SB-SLVRI ACCOUNT NUMBER : 29152** జమచేస్తున్నాం. జీవిత సభ్యత్వం చెల్లించిన వారి వివరాలన్నీ ఎప్పటికప్పుడు ప్రతి నెలా మెహెర్‌బాబా సంచికలో ప్రచురిస్తున్నాం. పత్రిక వార్షిక సభ్యత్వంపై వచ్చే నగదును ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, **(ఐ.ఓ.బి)** సైనిక్‌పురి బ్రాంచ్, సికింద్రాబాద్‌లో సేవింగ్స్ అక్కౌంటు నంబరు **SB ACCOUNT NUMBER : 27973** లో జమచేస్తున్నాం.

## వడ్డీ వినియోగం

నేటికి పత్రిక ప్రారంభించి 19 సంవత్సరాలు పూర్తయ్యాయి. 2020 మే మాసంలో 20వ ఏట అడుగుపెట్టాం. గత దశాబ్దం పైగా జీవిత సభ్యులు చెల్లించిన నగదును పోస్టాఫీసు యం.ఐ.యస్ పథకంలో పొదుపు చేశాం. దానిపై వచ్చే వడ్డీని తిరిగి

అదే పోస్టాఫీసులో రికరింగ్ డిపాజిట్‌లో వుంచాం. ప్రతిపైసా జాగ్రత్తగా పొదుపుచేసి, బ్యాంకు పథకాలపై వచ్చిన వడ్డీని పత్రిక ప్రింటింగు ఖర్చులకు ఏమాత్రం వాడకుండా, **"వడ్డీపై వడ్డీ"** అన్నట్లు ఆదాయాన్ని పెంచుకునేలా చర్యలు తీసుకున్నాం. తద్వారా, నేటికి రూ. 20 లక్షల పైగా డిపాజిట్ సేకరణ లక్ష్యాన్ని చేరుకున్నాం. 2018 నుండి జీవిత సభ్యుల చెల్లింపులపై నుండి వస్తున్న వార్షిక వడ్డీని పత్రిక నిర్వహణలో వినియోగిస్తున్నాం. 2017 డిశెంబరు వరకూ పత్రికా నిర్వహణలో వస్తున్న లోటు బడ్జెట్టును శ్రీ దశిక ప్రసాదరావు గారి కుమారుడు శ్రీ మెహెర్‌బాబా దశిక, అమెరికా, అందజేశారన్న సంగతి పాఠకులకు తెలుసు. కాగా, మెహెర్‌బాబా పత్రిక తరపున గల స్థానిక బ్యాంకు ఖాతాల వివరాలు, పోస్టాఫీసు అక్కౌంట్లపై వస్తున్న వడ్డీ వివరాలు ప్రక్క పేజీ 35లో సమగ్రంగా వుంచడమైంది. సమీక్షించగలరు. దయచేసి స్పందించ గలరు.

## ఐ.ఓ.బి.లో రూ. 4.20 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్

2020 నవంబరు 11 నాటికి స్థానిక ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనికపురి బ్రాంచి సేవింగ్స్ అక్కౌంట్ నంబరు 27973లో వార్షిక సభ్యత్వం, పోస్టాఫీసు పథకాలపై వడ్డీ రూపేణా వచ్చిన నిల్వలు మొత్తం రూ 3,48,936/-, అదే బ్యాంకులో జీవిత సభ్యత్వం రూపేణా చెల్లించిన నగదు ఫ్లెక్సీ ఫిక్స్‌డ్ డిపాజిట్ అక్కౌంటు నంబరు 29152లో వున్న నిల్వలు మొత్తం రూ 83,679/- వున్నాయి. కాగా, జీవితసభ్యుల చెల్లింపుల అక్కౌంటులో నుండి రూ 70,000/-, వార్షిక సభ్యత్వ సేవింగ్స్ అక్కౌంటులో నుండి రూ. 3,50,000/- మొత్తం రూ. 4,20,000/- విత్‌డ్రా చేసి, ఒక ఏడాది కాలానికి, (12 నెలలకు గాను) అదే బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయడమైనది.
**Indian Overseas Bank Fixed deposit account number -0975632 dt 12.11.2020. To be Matured on 12.11.2021. Maturity Value: Rs. 4,42,051/-** దీనివల్ల 5.5% వడ్డీతో కలిపి 12.11.2021 నాటికి మొత్తం నగదు రూ 4,44,051/- లభించనుంది. అనగా, రూ 22, 205/- వార్షిక వడ్డీ లభిస్తుంది. వడ్డీ రేట్లు తగ్గుతున్న ప్రస్తుత తరుణంలో అదనపు ఆదాయం కోసం ఈ చర్యను తీసుకొనడమైనది.

## పోస్టాఫీసు టైం డిపాజిట్

**పోస్టాఫీసు టైం డిపాజిట్ అక్కౌంట్ నంబరు 3201358895, 2021** మార్చి 5న మెచ్యూరుకాగలదు. ఆ నగదును తిరిగి పోస్టాఫీసు టైం డిపాజిట్‌లో బద్రపరచాలని ప్రతిపాదించడమైంది. **దయచేసి స్పందించగలరు.**

***

## పోస్టాఫీస్ ఖాతాలలో జమ చేసిన జీవిత సభ్యత్వం నగదు- వివరాలు 15.1.2021 వరకూ ఇలా వున్నాయి.

| Sl. No | Life Membership deposits | | |
|---|---|---|---|
| 01 | Post Office TD Rs 8,00,000/<br>Joint -B A/c<br>Papayamma & M. Sarada<br>A/c NO: 3201358895<br>5-3-2016 to 5-3-2021 | | Yearly interest payable during March every year<br>(approx. 70198/-)<br>Tirumulghery Post Office, Secunderabad. |
| 02 | Post Office TD Rs 9,00,000/<br>Joint -B A/c<br>Papayamma & M. Sarada<br>A/c NO: 3680306721<br>14-6-2017 to 14-6-2022 | | Yearly interest payable during JUNE every year<br>(approx. 71,326/-)<br>Tirumulghery Post Office, Secunderabad. |
| 03 | Post Office TD<br>Rs 3,50,000/<br>Joint -B A/c<br>Papayamma & M. Sarada<br>A/c NO: 3693488476<br>28-6-2017 to 28-6-2022 | | Yearly interest payable during JUNE every year<br>(approx. 27,738/-)<br>Tirumulghery Post Office, Secunderabad. |
| 04 | Indian Overseas Bank Flexi Fixed deposit account number -29152 balance particulars as on 11.1.2021<br>Rs. 17,679.66 | 05 | Indian Overseas Bank<br>Fixed deposit account number -0975632 dt 12.11.2020 for Rs. 4,20,000/-.<br>To be Matured on 12.11.2021.**Maturity Value: Rs. 4,42,051/-** |
| 06 | Indian Overseas Bank SB account number -27973<br>balance particulars<br>as on 11.1.2021,<br>Rs. 8,535.02 | | *** TOTAL POSTAL TIME DEPOSITS ARE RS. 24,70,000/-**<br>***Yearly interest being received in March/June every year: Rs. 1,69,262/-** |

# 2020 స్మృతిపథంలో...

2021 జనవరి మెహెర్‌బాబా సంచిక మీ చేతిలో వుంది. ప్రతినెలా మెహెర్‌బాబా సంచికను బాబావారి సందేశాలతో సర్వాంగసుందరంగా ప్రచురించేందుకు, ఆసక్తికర సమాచారం అందజేసేందుకు, మీ ఇంటిల్లిపాదీ పత్రికను చదివి ఆనందించాలన్న తాపత్రయంతో మా శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నాం. మెహెర్‌బాబా సందేశాల వ్యాప్తికి సంపూర్ణంగా అంకితమైన మాసపత్రిక మెహెర్‌బాబా. సుమారుగా గత రెండు దశాబ్దాలుగా పత్రికను ఆదరిస్తున్న మీ అందరకూ మనస్ఫూర్తిగా జై మెహెర్‌బాబాలు తెలియజేసుకుంటున్నాం. కాగా, 2020 జనవరి నుండి డిశెంబరు దాకా మెహెర్‌బాబా సంచికలలో నెలవారీగా ప్రచురించిన పలు ప్రధాన శీర్షికలను సంక్షిప్తంగా ఒకసారి స్మృతిపథంలో సింహావలోకనం చేసుకుందాం!! వర్తమానం భవిష్యత్తుకు మార్గదర్శకం కదా! 2020 జనవరి నుండి డిశెంబరు దాకా మెహెర్‌బాబా సంచికలలో అనేక ప్రత్యేక శీర్షికలతో అవతారుని సందేశాలు ప్రచురించడమైంది. 2020 జనవరి, ఫిబ్రవరి సంచికలలో అవతారుని అమరతిథి విశేషాలు కళ్ళకుకట్టినట్లు వివరించే ప్రయత్నం చేశాం.

## కరోనా ప్రభావం

కరోనా వైరస్ ప్రభావం మెహెర్‌బాబా పత్రికలపై కూడా చూపింది. 2020 మార్చి మెహెర్‌బాబా సంచికను ఎప్పటిలా మార్చి 25వ తేదీకి సిద్ధం చేశాం. మార్చి 26న పత్రికను పోస్టుచేయవల్సిన రోజు. ఆ రోజుకి మెహెర్‌బాబా పత్రికలు ప్రింటింగ్ పూర్తిచేసుకుని పోస్టాఫీసుకు పంపినాము. కానీ, అంతక్రితం రోజుననే పోస్టలు సర్వీసులు నిలిపివేసినట్లు తెలిపారు. ఆ మాదిరిగా మార్చి నెలలో ప్రచురించిన పత్రికలు బట్వాడా కాలేదు. వాట్సప్, ఇ-మెయిల్ వున్నవారందరికీ పత్రికను పంపడమైంది. అదేమాదిరిగా 2020 ఏప్రిల్, మే, జూన్ నెలలలో ఎప్పటిలా పత్రికను తయారుచేసి, వాట్సప్, ఇ-మెయిల్ ద్వారా పాఠకులకు అందజేశాం. ఏప్రిల్, మే నెలలలో ప్రింటింగ్ ప్రెస్‌లు కూడా లాక్‌డౌన్‌లో వున్నాయి. 2020 జూలై సంచిక నుండి యథాప్రకారం పత్రికను ప్రింటింగ్ కొనసాగింది. **ఈ విషయమై ఆసక్తిగల పాఠకులందరూ తమ వాట్సప్ లేదా ఇమెయిల్ అడ్రస్‌లు నమోదు చేసుకోవల్సిందిగా కోరుతున్నాం.** తద్వారా పాఠకులకు పత్రికను సకాలంలో అందజేయగల్గుతామని మనవి. విశేషం ఏమంటే, ఇంతటి విపత్కర కరోనా వైరస్ మహమ్మారి ప్రభావంలో కూడా మెహెర్‌బాబా పత్రికలో ప్రతినెలా నిర్వహించే ధారావాహిక సీరియల్స్ లేదా పలు శీర్షికల ప్రచురణలో ఎలాంటి మార్పులేకుండా అవతారుని ఆశీశ్శులతో నిర్విఘ్నంగా పత్రికను ప్రచురించాం.

అంతేకాదు, పాఠకులు సయితం తమ వార్షిక, జీవితసభ్యత్వాలు, విరాళాలను ఎప్పటికంటే మిన్నగా అందజేసి మమ్మల్ని ఎంతగానో ప్రోత్సహించారు.

## ధారావాహిక సీరియల్స్ / ప్రత్యేక శీర్షికలు

శ్రీ మల్లాది రామారావ్, మెహెరాబాద్ గారి తెలుగు అనువాదం "మెహెర్ ప్రభు" ధారావాహిక సీరియల్ తమనెంతగానో ఆకట్టుకుంటోందని అనేకమంది పాఠకులు తెలియజేశారు. అలాగే, 1958 మే మాసంలో మెహెరాబాద్‌లో అవతారుడు జరిపిన ప్రత్యేక ప్రాంతీయ సహవాస్ ధారావాహిక సీరియల్ ద్వారా ఎంతో అరుదైన సమాచారం లభిస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సీరియల్ ద్వారా మెహెరాబాద్ సహవాస్‌లో అవతారుని మాటలు ఆలకిస్తున్నట్లుందని పలువురు పాఠకులు అన్నారు. ఇకపోతే ప్రత్యేక శీర్షికలుగా 2020 జనవరి నుండి వరుసగా ప్రచురించిన "మా ఆస్ట్రేలియా యాత్రా విశేషాలు, ఆనాటి మేటి పత్రికల వివరాలు, సందేశాత్మక కథాంశం – గురువాజ్ఞ, ఎంతో చిన్నది జీవితం!! అని బాబా మండలి సభ్యుడైన ఏరుచ్ చెప్పిన కథాంశం, నిజాయితీగా మసులుకోవడమే దైవత్వం, శీర్షికతో అవతారుని ప్రవచనము శ్రీ నోరి హనుమంతరావు, హైదరాబాద్, కరోనాలోని వెలుగు రేఖ, అవతారుని సందేశంపై శ్రీ టి. అక్బర్ కృష్ణ, సద్యః ఫలితం కథాంశం, శ్రీమతి శారద, కోల్‌కత్తాలో మెహెర్ ప్రేమిక సమ్మేళనంపై సమీక్ష శ్రీ మెహెర్ ప్రకాశ్, విశాఖ, అలాగే, బాబా చెప్పిన సందేశం – దివ్యత్వానికి రెండు పార్శ్వాలు, "నేను ఏకాంతవాసంలో ఎన్నడూ లేను", అని అవతారుని ఉవాచ – శీర్షికతో శ్రీధర్ కేల్కర్ గారి ప్రసంగ పాఠవం, బాబా తన మండలితో చెప్పిన "తప్పు ఎవరిది?" పొడుపు కథలాంటి కథాంశం, అరుదైన విషయాలకు ప్రత్యక్ష సాక్ష్యం – షెరియార్జీ సుతం దేవం, యం. ఆర్. ధాకే ఫాల్కర్ గారి అనుభవాల గ్రంథం నుండి సేకరించిన కథాంశం, దైవీ ప్రణాళికలోనే అవతారుని ఇచ్ఛ, అవతారుని సందేశం, శ్రీ ఆర్. రామచంద్రయ్య, ఖమ్మం, ముగ్గురు మౌన యోగులు, కర్మఫలాలు, మౌన వార్షికోత్సవంపై బాబా ప్రేమికుల అనుభవాలు, మెహెర్‌బాబా ఎవరు? ప్రశ్న–జవాబుల శీర్షిక, ఆంధ్రా పర్యటనలో కూల్‌డ్రింక్స్ ప్రసాదం, శ్రీ బి. క్రిష్ణయ్య గారి రచన "భాగ్యనగరంలో బాబావారి పర్యటనలు", మానవుని బలహీనతలపై "సంఘర్షణ' కథాంశం, ధాకేఫాల్కర్ రచన– టైలర్, ఆపద్బాందవుడు, శ్రీ వల్లూరి, విశాఖవారి లఘునాటిక, బాబా ఇష్టపడిన దర్బార్ ఫోటోపై విశ్లేషణ, మంత్రవాది తీసిన చిత్రం బాబా సమాధిలో, తదితర అంశాలతో 2020 జనవరి నుండి డిశెంబరు దాకా మెహెర్‌బాబా పత్రికలు ఎన్నో ఆసక్తికర విషయాలను అందజేసిందని పాఠకులు అభిప్రాయపడ్డారు.

**బాబా సేవలో తరించిన** అలాగే, అన్నింటికంటే మిన్నగా బాబా సేవలో

తరించిన పలువురి బాబా ప్రేమికుల జీవన రేఖాచిత్రాల వివరాలను ఈ తరం వారికోసమని మెహెర్‌బాబా సంచికలలో ప్రచురించి వారిని ఓమారు స్మరించుకునే ప్రయత్నం చేశాం. ఆ కోవలో వరుసగా సరోష్ ఇరాని, శ్రీమతి లక్ష్మీ హరీష్ కాంబ్లే, మెహెర్‌జీ ఆర్దేషిర్ కర్కారియా, ఫిలిస్ ఫ్రెడ్రిక్, చించోర్‌కర్, విష్ణు మాస్టర్, డాక్టర్ నీలకంఠ యస్ గోడ్‌సే (డాక్టర్ నీలూ) గురించి ప్రత్యేక శీర్షికలుగా ఈ ఏడాది పత్రికలలో ప్రచురించడమైంది. వీరు బాబా సేవలో సేద తీరిన వైనం తెలియజేసే ప్రయత్నం చేయడమైంది.

## బాబాలో ఐక్యం

గత ఏడాది కాలంలో ఎందరో బాబా ప్రేమికులు అవతారునిలో ఐక్యమయ్యారు. ఈ సందర్భంగా వారందరికి నివాళిగా ఓ క్షణం స్మరించుకుందాం!!. 2020 జనవరి నుండి వరుసగా, 1) శ్రీమతి ఫ్రేనీ నాలావాలా 2) శ్రీమతి చిలకలపూడి లలితాంబ 3) చిలుకూరి లక్ష్మీపతి 4) శ్రీ గణేశ్వరరావు 5) శ్రీ గోపగాని నరసయ్య 6) శ్రీమతి మంత్రిప్రగడ బాలసరస్వతి 7) శ్రీమతి బొడ్డపాటి సూర్యకాంతం 8) శ్రీ రామచంద్ర 9) శ్రీ యు. బాపిరాజు 10) శ్రీమతి తవ్వా అనూరాధ 11) శ్రీ కామరపు శ్రీనివాసరావు 12) శ్రీ కెహెచ్‌కె ప్రసాద్ 13) శ్రీమతి కె. లక్ష్మీకాంతమ్మ 14) శ్రీ డిఆర్‌కె గోపాలరావు 15) శ్రీ ఘంటశాల నాగేంద్ర ప్రసాద్ 16) శ్రీ గుండు సుగుణభూషణ రావు 17) శ్రీమతి జానకీ పుకార్ 18) శ్రీమతి వి. సీతాకళ్యాణి 19) శ్రీమతి చంద్రకళ 20) శ్రీమతి పి సరోజ 21) శ్రీమతి యన్ సూర్యాకాంతం 22) శ్రీ జి. రామారావు 23) శ్రీ జి. స్వతంత్ర కుమార్ 24) శ్రీ సతీష్ 25) శ్రీమతి పసుపులేటి సరస్వతి 26) శ్రీమతి బాలామణి, హైదరాబాద్, 27) శ్రీ నర్సింహమూర్తి, వరంగల్ గారి భార్య శ్రీమతి శారద, 28) శ్రీ ఎల్.వి. నారాయణరెడ్డి, మేడ్చల్, 29) శ్రీ బసవరాజు, 30) శ్రీ యం భీమశంకరం, 31) శ్రీ మల్లేష్, 32) శ్రీమతి గంద్ర రాధమ్మ, 33) శ్రీ కృష్ణకుమార్, 34) శ్రీ మల్లెల గురుప్రసాద్ 35) శ్రీ పండుగ రమణ 36) శ్రీమతి గిరిజారాణి, 37) శ్రీమతి మంత్రమూర్తి లక్ష్మి, 38) మెహెర్ ప్రజ్వల్, 39) ఉమేష్, సికింద్రాబాద్ తదితరులు బాబా నామస్మరణతో అవతారునిలో ఐక్యమయ్యారు. వీరు ధన్యులు.

## వర్చ్యువల్ సహవాస్‌లు

కరోనా కాలంలో తెలుగునాట అవతారుని వర్చ్యువల్ సత్సంగ్‌లు దాదాపు అన్ని బాబా కేంద్రాలలోని ప్రేమికులు పాల్గొనేలా పెద్దఎత్తున ఏర్పాట్లు జరిగాయి. సోషల్ మీడియాలోని పలు మాధ్యమాల ద్వారా అవతారుని సందేశాలపై విశేష సమాచారాన్ని మున్నెనన్నడూ ఎరుగని రీతిలో అందజేయడం ఈ ఏడాది ప్రత్యేకత అనొచ్చు.

*****

# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము. మరియు చిట్టచివరి వరకు బాబా కొంగును దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

## జీవిత సభ్యత్వం

**2021 జనవరిలో పంపిన వారి వివరాలు**

| | | |
|---|---|---|
| 1. | శ్రీ రాంపల్లి చంద్రమౌళి, వెంకట్రావ్‌పేట, మంచిర్యాల జిల్లా | 500/- |
| | మొత్తం | 500/- |

**మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు**
శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.
**SB A/C NO: 173201000029152, IFSC CODE: IOBA 0001732.**

**మెహెర్‌బాబా పత్రిక వార్షిక సభ్యత్వం రూ. 100/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు**
శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.
**SB A/C NO: 173201000027973, IFSC CODE: IOBA 0001732.**
సభ్యత్వం పోస్టులో మనీ ఆర్డర్, బ్యాంకు చెక్కు, లేదా డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా పంపగోరువారు ఈ క్రింది పోస్టలు అడ్రస్సుకు పంపవల్సింది.

**మా అడ్రస్:**
**ఎడిటర్, మెహెర్‌బాబా,**
**గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్,**
యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్ కాలనీ పోస్టు,
సికింద్రాబాద్-500087. ఫోన్: **99595-53218.**
**email: malladisukku@gmail.com**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad. **Editor: D. Nirmaladevi**

**RNI No. APTEL/2002/7310, Postal Concession: HSE/789/2020-2022 Dt.20-01-2020, Date of Publication 20h of every month, Posted at Patrika Channel on 25 / 26th every month.**